### కాలుష్యం కోరల్లో గ్రామాలు



-మెగా కంపెనీ డంప్‌యార్డు వద్ద గ్రామస్తుల ధర్నా

### పక్షులకు మూకట్లలో నీళ్ళు నక్షత్రవనం పరిరక్షణ





### చౌడేపల్లిలో నడివీధి గంగమ్మ జాతర

4లో


# తిరుపతి - చిత్తూరు



తెలుగు జాతీయ దినపత్రిక
వార్త




## కల్వర్టును ఢీకొట్టిన కారు

### మహిళ మృతి .. నలుగురికి గాయాలు



చంద్రగిరి, ఏప్రిల్ 30 ప్రభాతవార్త:

పూతలపట్టు-నాయుడు పేట జాతీయ రహదారి ముంగిలిపట్టు వద్ద కారు కల్వర్టును ఢీకొట్టిన ఘటన మంగళవారం వేకువజామున చోటుచేసుకున్నట్లు ఎస్‌ఐ అనిత తెలిపారు. సిఐ రామయ్య ఆదేశాల మేరకు సంఘటనా స్థలికి చేరుకున్న ఎస్‌ఐ అనిత క్షతగాత్రులను 108 ద్వారా తిరుపతి రుయాకు తరలించారు. ఈ ప్రమాదంపై ఆమె మాట్లాడుతూ కర్ణాటక, బంగారుపేటకు చెందిన ఒకే కుటుంబానికి చెందిన 5 మంది అనూష, మురళీధర్, అమర్, ఉమ, సుశీల తిరుమల శ్రీవారి దర్శనార్థం వచ్చారు. మంగళవారం వేకువజామున తిరుగు ప్రయాణంలో ముంగిలిపట్టు వద్ద వాహనం అదుపుతప్పి కల్వర్టును ఢీకొట్టింది. దీంతో వాహనంలోని సుశీల (55) మృతి చెందగా, మిగిలిన నలుగురికి గాయాలైనట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

### ప్రశాంత వాతావరణంలో

# ఎన్నికల నిర్వహణ

### రాష్ట్ర ప్రత్యేక సాధారణ పరిశీలకులు రామ్మోహన్ మిశ్రా



ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లుపై అధికారులతో సమావేశమైన రాష్ట్ర ప్రత్యేక సాధారణ పరిశీలకులు

చిత్తూరు, ఏప్రిల్ 30 ప్రభాతవార్త:

జిల్లాలో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో సజావుగా జరుగడానికి జిల్లా యంత్రాంగం నిర్దిష్ట ప్రణాళికతో ముందుకు వెళ్ళాలని భారత ఎన్నికల సంఘంచే నియమించబడ్డ రాష్ట్ర ప్రత్యేక సాధారణ పరిశీలకులు రామ్మోహన్ మిశ్రా పేర్కొన్నారు. జిల్లా సచివాలయంలోని సమావేశం మందిరంలో మంగళవారం ఎలక్షన్ కమీషన్‌చే నియమించబడ్డ రాష్ట్ర ప్రత్యేక పరిశీలకులు జిల్లా ఎన్నికల నిర్వహణకు చేపడుతున్న చర్యలపై నగిరి, జీడి.నెల్లూరు నియోజకవర్గాల జనరల్ పరిశీలకులు కైలాష్ వాంఖేడే, చిత్తూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం అసెంబ్లీ నియోజకవర్గాల పరిశీకులు షాదిక్ ఆలాం, పోలీస్ పరిశీలకులు అమిత్ రాజ్‌లతో కలసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో రాష్ట్ర సాధారణ పరిశీలకులు మాట్లాడుతూ జిల్లాలో శాంతియుత వాతావరణంలో నిష్పక్షపాతంగా ఎన్నికల నిర్వహణకు కలెక్టర్, ఎస్పీలు, ఒక నిర్దిష్ట ప్రణాళికతో ముందుకు వెళుతున్నారన్నారు. ఎన్నికల సంఘం నియమ నిబంధనల మేరకు ఎన్నికల నిర్వహణకు చేపడుతున న్ని చర్యలపై ఆయన సంతృప్తి వ్యక్తం చేస్తూ జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ షగిలి షన్మోహన్‌ను అభినందించారు. ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ తమ ఓటు మక్కును వినియోగించుకునేలా జిల్లాలో చేపట్టిన స్వీప్ కార్యక్రమాలు బాగున్నాయని కితాబునిచ్చారు. అలాగే మే 13న ప్రతి ఓటరు స్వేచ్ఛాయుత వాతావరణంలో తన ఓటు హక్కును వినయోగించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పక్కాగా అమలు చేయాలని,అక్రమ మద్యం, నగదు పంపిణీ, ఇతర తాయిలాల పంపిణీ తదితర అంశాలపై గట్టి నిఘా వుంచాలన్నారు. ఈసమావేశంలో జిల్లా ఎన్నికల అధికారి షగిలి షన్మోమన్ జిల్లాలో ఎన్నికల నిర్వహణకు చేసిన ఏర్పాట్లును, జిలా బౌగోళిక పరిస్థితిని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పరిశీలకులకు వివరించారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లుకు కనీస మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని వికలాంగుల కోసం ప్రతి పోలింగ్ కేంద్రంలో ర్యాంప్‌లు, ట్రైసైకిల్‌లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని మార్చి 16 నుండి ఇప్పటి వరకు 821 బైండోవర్ కేసులను రిజిష్టర్ చేయడం జరిగిందన్నారు. చిత్తూరు జిల్లాకు తమిళనాడు, కర్నాటక రాష్ట్రాలు సరిహద్దులుగా వుండడంతో సరిహద్దు ప్రాంతాల్లో 21 చెక్ పోస్టులు ఏర్పాటు చేయగా ఇందులో 15 పోలీస్ చెక్ పోస్టులు, రెండు ఏసీబి చెక్ పోస్టులు, రెండు పారెస్ట్ చెక్‌పోస్టులు, రెండు ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్టులు వున్నాయన్నారు. ఇందులో 14 చెక్ పోస్టులు తమిళనాడు సరిహద్దులకు సంభందించి, 7 చెక్ పోస్టులు కర్నాటక సరిహద్దులో వున్నాయన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో కేంద్ర బలగాల కవాతు నిర్వహించడం జరగిందన్నారు. ఈసమావేశంలో జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, డీఆర్‌ఓ పి.పుల్లయ్య, జడ్పీ సీఈఓ గ్లోరియా, అడ్మిన్ అదనపు ఎసీ ప్ర అరీపుల్లా, డీఎస్పీ శ్రావణకుమార్ అధికారులు, ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# ష్...గప్..చుప్...!

### సదుం ఘటనపై నోరు మెదపని పోలీసులు

ప్రభాతవార్త -తిరుపతి

సోమవారం సాయంత్రం చిత్తూరు జిల్లా సదుం లో జరిగిన ఘటనపై పోలీసులు నోరుమెదపడం లేదు. ఎవరిని అడిగినా మాకుతెలియదు,మా పైవారిని అడగండి అంటూ దాటవేస్తున్నారు. వివరాలలోకి వెళితే సోమవారం సాయంత్రం బి.సి.వై పార్టీ అధినేత,పుంగనూరు ఆ పార్టీ అభ్యర్థి బి.రామచంద్రయాదవ్ సదుం మండలం యత్రాతివవారి పల్లెలో ప్రచారం కోసం వెళ్ళగా , అక్కడ వైకాపా కార్యకర్తలు,స్థానికులు ఆయన పైనా, ఆయన వాహనాల శ్రేణిపైన రాళ్ళవర్షం కురిపించి,దాదాపు పది వాహనాలను పెట్రోల్ పోసి దగ్ధం చేసిన ఘటన తెలిసిందే. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి స్వగ్రామమైన యత్రాతి వారిపల్లెలో ప్రచారం కోసం వెళ్ళిన రామచంద్ర యాదవ్‌పై అనూహ్యంగా కొందరు మూకుమ్మడిగా అడ్డుకోవడంతో పాటు,వారిపై రాళ్ళు రువ్వుతూ అక్కడినుంచి తరుముకుంటూ వెళ్ళగా, రామచంద్ర యాదవ్ తన వాహనశ్రేణితో సదుం పోలీస్‌స్టేషన్ లోకి వెళ్ళి వారి రక్షణకోరారు.అయినా ఆయనను వెంబడించిన మూకలు పోలీస్‌స్టేషన్ ఎదుటే దుర్భాషలాడుతూ కనపడిన వాహనాలను ధ్వం సం చేస్తూ,చివరకు వాటిపై పెట్రోల్ పోసి దగ్ధం చేశారు.ఈ ఘటన జరు గుతున్న సమయంలో పోలీస్‌స్టేషన్‌లోనే వుండిపోయిన రామచంద్ర యాదవ్‌ను పోలీసులు సురక్షితంగా పుంగనూ రులోని ఆయన నివాసానికి చేర్చారు.ఇదిలా వుం డగా వై కేటగిరి భద్రత గల రామచంద్రయాదవ్ తమపై జరిగిన దాడిని ఇటు రాష్ట్ర పోలీసులకు, అటు తన భద్రతకోసం కేటాయించిన సి.ఆర్.పి. ఎఫ్ ఉన్నతాధికారులకు సమాచారం చేర



వేశారు.ఈ ఘటన జరుగుతున్న సమయంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి వరుసకు సోద రుడయ్యే పెద్దిరెడ్డి తమ కార్యకర్తలను ఎంతగా వారించినా ఒక దశలో వారు ఆయన మాటలను కూడా లెక్కచేయకుండా వ్యవహరించారు.కాగా స మాచారం అందుకున్న అనంతపురం ఐ.జి అమ్మి రెడ్డి అర్ధరాత్రి 12 గంటల సమయంలో సదుం చేరుకుని ఘటన వివరాలను అడిగి తెలుసుకు న్నారు. ఆయనతో పాటు చిత్తూరు ఎస్‌పి మణి కంఠ కూడా వున్నారు.కాగా ఐ.జి అమ్మిరెడ్డి తెల్ల వారు జామున 4 గంటల దాకా పోలీస్‌స్టేషన్‌లోనే వుండి తరువాత అనంతపురం వెళ్ళగా,ఎస్పీ మణికంఠ మాత్ర ఉదయం దాకా అక్కడే వున్నారు. కానీ పోలీసులు మాత్రం ఈ ఘటనపై ఏమైనా కేసులు నమోదు అయ్యాయా ?లేదా అన్న ప్రశ్న లకు సమాధానం చెప్పలేకపోతున్నారు.విశ్వసనీయ సమాచారం మేరకు వాహనాల దగ్ధం కేసులో 8 మంది అనుమానితులను గుర్తించి వారిపై కేసు న మోదుచేసినట్టు,అలాగేరామచంద్రయాదవ్‌పై కూడా కేసు నమోదుచేసినట్టు తెలిసింది.ఈ కేసు ఎలాంటి మలుపులు తిరుగుతుందో చూడాల్సి వుంది.

# పల్లెల్లో మందూ...విందూ...!

### -ఓటర్లను కూడగట్టే పనిలో నాయకులు



తిరుపతిరూరల్, ఏప్రిల్30 ప్రభాతవార్త:

సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తుండటంతో గ్రామాల్లో విందు రాజకీయాలు ఊపందుకున్నాయి. రాత్రి వేళలలో ఆయా గ్రామాల్లో నాయకులు వంటవార్పు కార్యక్రమాన్ని నిర్వహిస్తూ, ఓటర్లను కూడగట్టే పనిలో బిజీగా ఉన్నారు. ఎలాగైన తమ అభిమాన నాయకుణ్ణి గెలిపించుకోవాలనే తాపత్రాయంతో విందు రాజకీయాలు చేస్తున్నారు. ప్రతిరోజు రాత్రివేళలలో ఆయా గ్రామ పంచాయతీలలో ఒక్కో కాలనీ ఓటర్లను ఎంచుకుని మాంసాహారంతో పాటు మద్యం కూడా సరఫరా చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. పోలింగ్ సమయం సమీపిస్తుండటంతో ఎలాగైన ఓటర్లను మభ్యపెట్టి, తమ పార్టీ వైపు మళ్ళించుకుని గెలవాలనే తపనతో విందు రాజకీయాలు చేస్తున్నారు. విందు రాజకీయాల్లో బంధువులను, కులస్తులను కూడా కూడగట్టే ప్రయత్నం చేస్తున్నారు. ప్రస్తుత ప్రజాప్రతినిధి చేసిన అభివృద్ధి పనులు, కష్టకాలంలో చేసిన చేసిన సేవలను గుర్తు చేసుకొంటూ, కొత్త అభ్యర్థిని గెలిపిస్తే ఎలాంటి అభివృద్ధి పనులు చేస్తారో...ఎలాంటి హామీలు ఇస్తారో నేమరు వేసుకొంటు ఓటర్లు విందును ఆరగిస్తున్నారు.

### ఎండలో మాడ్చొద్దు..

# మా ఉసురు తీయొద్దు !

### - ఇంటికే పించన్ ఇవ్వాలని వృద్ధులు వేడుకోలు



కోట, ఏప్రిల్ 30 ప్రభాతవార్త

సామాజిక పింఛన్ మొత్తాన్ని బ్యాంకు ఖాతాలకు జమ చేయాలని రాష్ట్రప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. ఈ నిర్ణయం వారిని మరింత ఇబ్బంది పెట్టేలా ఉంది. లబ్ధిదారులు వ్యయప్రయాసలకోర్చి రెండు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న బ్యాంకులకు వెళ్లి డబ్బులు డ్రా చేసుకోవాల్సి న పరిస్థితిని కల్పిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికార వైసీపీ ప్రభుత్వం పింఛన్ల పంపిణీని రాజకీయ కోణంలో చూడటం వల్లే ప్రస్తుతం లబ్ధిదారులకు ఇబ్బందులు తప్పడం లేదని తెలుగుదేశం పార్టీ నాయకులు ఆరోపిస్తున్నారు. అడుగుతీసి అడుగు వేయలేని వృద్ధులు, వితంతువులు, దివ్యాంగుల్లో ఎంతమంది బ్యాంకులకు వెళ్లి పింఛన్ డబ్బులు తీసుకోగలరని వారు ప్రశ్నిస్తున్నారు. సార్వత్రిక ఎన్నికల ముంగిట ఇచ్చే పింఛన్ కావడంతో ఏదో విధంగా లబ్ధిదారులకు అసౌకర్యం కలిగించి ఇదంతా విఫక్షాల వల్లే అని దుష్ప్రచారం చేసి లబ్ధిపొందాలని అధికార వైసీపీ చూస్తోందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. వాలంటీర్లతో ఇంటింటికి వెళ్లి పంపిణీ చేసే విధానాన్ని విపక్షాలు అడ్డుకున్నాయని, అందువల్లే మీకు ఈ కష్టాలు వచ్చాయని చెప్పడానికి తాజాగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టమవుతోంది. వాలంటీర్లను ఇంటింటికి పంపకూడదని చెప్పిందే తప్ప సచివాలయ ఉద్యోగులను కాదు. మే 1న లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ సొమ్ము పంపిణీ చేయడానికి సరిపడా సిబ్బంది ఉన్నా వినియోగించుకోకుండా సిబ్బంది లేరని కుంటిసాకులు చెబుతున్నారని ఆరోపిస్తున్నారు. ఆపై ఆధార్ లింక్ అయిన బ్యాంకు ఖాతాకే జమ చేస్తామంటున్నారు. ఆ వృద్ధుల్లో ఎందరికి ఆధార్ బ్యాంకు ఖాతాలో అనుసంధానమై ఉంటుందో అధికారులు ఆలోచించాలి. వృద్ధులకు పింఛన్ సొమ్ములే ఆధారం. ఇన్నాళ్లు వారి ఖాతాల్లో ఎలాంటి సొమ్ము జమ చేయలేదు. ఏటీఎం కార్డులు లేని వారు చాలామందే ఉన్నారు. ఇలాంటి వారు నేరుగా బ్యాంకుకు వెళ్లాలి. విత్‌డ్రా ఫారం నింపి తీసుకోవాలి. దాన్ని రాయించుకోవడానికి ఇతరులపై ఆధారపడాలి. లైనులో నిలబడి సంతకం చేసి డబ్బులు తీసుకోవాలి. బ్యాంకులు దూరంగా ఉన్న వారికి ఇబ్బందులు తప్పేలా లేవు. మే 13న పోలింగ్. అప్పటిదాకా సచివాలయ ఉద్యోగులు అందుబాటులో ఉంటారు. అత్యవసరమైతే అంగన్‌వాడీలు, మెప్మా ఉద్యోగుల సహకారం తీసుకోవచ్చు. ఒకటీ రెండురోజుల్లో లబ్ధిదారుల ఇళ్లకే పింఛన్లు పంపిణీ చేసే అవకాశం ఉన్నా ఎంతసేపటికీ సిబ్బంది లేరన్న సాకు చూపి లబ్ధిదారులను ఇబ్బందులు పెట్టి అంతిమంగా విపక్షాలను తిట్టించడమే పాలకుల ఉద్దేశంగా మారింది.

# ఈతకు వెళ్లి శవమై తేలాడు

### నీటమునిగి విద్యార్థి మృతి





మూర్తి (ఫైల్‌ఫోటో)

మూర్తి మృతదేహాన్ని బయటకు తీస్తున్న ఫైర్ సిబ్బంది

నగరి, ఏప్రిల్ 30 ప్రభాతవార్త:

ఈతకు వెళ్లి విద్యార్థి శవమై తేలిన ఘటన మున్సిపల్ పరిధి కనంమిట్ట వద్ద చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు కాకవేడు గ్రామానికి చెందిన వాసు కుమారుడు టి.మూర్తి(19) సోమవారం సాయంత్రం మిత్రులతో కలసి కనంమిట్ట క్రషర్ల సమీపం గల బావిలో ఈతకు వెళ్లాడు. బావిలోకి దుమికిన సమయంలో బయటకు రాకపోవడంతో వెతికి చూసినా స్నేహితులు అగ్నిమాపక అధికారి సుబ్బరాజుకు సమాచారం అందించగా ఆయన సిబ్బంది తో సంఘటనా స్థలానికి చేరుకుని వేతకడం ప్రారంభించారు. చీకటి పడడంతో జాడలేకపోవడంతో మంగళవారం ఉదయం మళ్లీ బావి నీటిలో గాలింపు చేపట్టారు. ఎట్టకేలకు నీటిలో చిక్కుకున్న మృతదేహాన్ని బయటకు తీశారు. కాగా మూర్తి స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. తల్లిదండ్రులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉండగా ఉన్న ఒక్క కుమారుడు మృతి చెందాడు. దీంతో ఆ కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది.

# కిటకిట లాడిన సుబ్రమణ్యం స్వామి ఆలయాలు

### చెంగల్వరాయునికి కోటి దండాలు -షణ్ముఖునికిషోడషోభికాషాలు

శ్రీకాళహస్తి,ఏప్రిల్ 30 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో అధ్యాత్మిక చింతన వెల్లి విరుస్తుంది. ధార్మిక దివ్యక్షేత్రంలో ప్రతి రోజూ ధార్మిక కార్యక్రమాలతో తులతూగుతుంది.స్థానిక భక్తులే కాకుండా దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు కూడా ఆధ్యాత్మిక చింతతనలో తన్మయత్వం పొందుతున్నారు.మంగళవారం శ్రీకాళహస్తీశ్వరా లయంలో వెలసిన చెంగల్వరాయస్వామి,తేరువీధిలో వెలసిన షణ్ముఖ స్వామి ఆలయా లు భక్తులతో కిట కిట లాడాయి. ఇసుకేస్తే రాలనంత రద్దీ చోటు చేసుకుంది,స్వామి వారికి షోడషాభిషేకాలు నిర్వహించారు.

పట్టణానికి ఓ వైపు దుర్గంబాకొండ మరోవైపు సుబ్రమణ్యంస్వామి ఆలయం కుమారస్వామి తిప్పగా వెలసి భక్తుల కొంగుబంగారంగా విరాలజిల్లుతుంది.మంగళవారం పట్టణంలోని సుబ్రమణ్యం స్వామి ఆలయాలు భక్తులతో కిట కిటలాడుతున్నాయి.ఈ నేపధ్యంలో శ్రీకాళహస్తి పట్టణంలోని తేరువీధిలో వెలసిన షణ్ముఖ స్వామి ఆలయం అలాగే శ్రీకాళహస్తీశ్వ రాలయానికి అనుబంధంగా ఉన్న కుమారస్వామి కొండపై వెలసిన సుబ్రమణ్యం స్వామి ఆలయం, శ్రీకాళహస్తీశ్వరాలయంలో రంగుల గోపురం పక్కన వెలసిన స్వామి, ఆలయంలోని చెంగల్వరాయస్వామి ఆలయంలో విశేషాభిషే కాలు నిర్వహించారు. ముఖ్యంగా తేరువీధిలో వెలసిన 'షణ్ముఖ స్వామి' ఆలయంలో స్వామికి షోడషాభిషేకాలు నిర్వహించారు. వందలాది లీటర్ల పాలు, పెరుగు,తేనే,విభూది,గంధం, కుంకుమ, పసుపు,సకల సుగంధ ద్రవ్యాలతో పూజలు అభిషేకాలు నిర్వహించారు. చూపరు లను ఇట్టు ఆకట్టుకునే రీతిలో అర్చకులు ప్రసాద్,మురళిలు తీర్చి దిద్దుతున్నారు.

**కుమారస్వామి ఆలయాలకు పొటెత్తున్న భక్తులు:**

శ్రీకాళహస్తిపట్టణంలోనూ,ఆలయంలో పలుసుబ్రమణ్యం స్వామి ఆలయాలున్నాయి. అయితే తేరువీధిలో ఆలయప్రధానార్చకులు స్వర్గీయ బాబు గురు కుల్స్ కు చెందిన ఆలయం షణ్ముఖ స్వామి ఆలయం. ఇక్కడ సుబ్రమణ్యం స్వామి ఆరుముఖాలతో వెలసి దర్శనమిస్తున్నారు.ఈ ఆలయం పట్టణ నడిబొడ్డులో ఉండటంతో ఇక్కడకు పట్టణ నలుమూలల నుంచి భక్తులు తండోపతండాలుగా కదలి వస్తున్నారు. భక్తులు ప్రతి ఒక్కరు పాలను, పెరుగును అందిస్తున్నారు. వాటితో అభిషేకాలు నిర్వహిస్తున్నారు.ఇక ఇక్కడ స్వాములు నిర్వహిస్తున్న అలంకారాలు ఇట్టే ఆకట్టుకుంటున్నాయి.ఇక భక్తులు వచ్చిన వారికి దాన ధర్మాలు చేస్తున్నారు. ఇక్కడ వెలసిన వినాయకుడు మహిమాన్వితుడని చెబుతారు. ఉదయం సూర్యోద యం నుంచి రాత్రి 9గంటల వరకు ఈ ఆలయంలో విశేష పూజలు, అలంకారాలు నిర్వహిస్తున్నారు.కాగా ఆలయంలోని రంగుల గోపురం పక్కనే వల్లిదేవసేన సమేత సుబ్రమణ్యం వెలసి భక్తుల కొంగుబంగారంగా వరాలిస్తున్నారు. ముఖ్యంగా ఇక్కడి ఆలయాల్లో కణితలు వచ్చిన వారు స్వామికి బెల్లం ముద్దలను నైవేద్యంగా పెట్టి పట్టణ నడిబొడ్డులోని నారద పుష్కరణిలో వేస్తున్నారు. కొన్ని వారాలకు వారికి నయం అవుతుందనే నమ్మకం ఉంది.



షణ్ముఖ స్వామికి ప్రత్యేక అలంకారాలు

# సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాల్లో సదుపాయాలను పరిశీలిస్తున్న ఎన్నికల వ్యయ పరిశీలకులు

చిత్తూరు, ఏప్రిల్ 30 ప్రభాతవార్త:

చిత్తూరు నగరపాలక సంస్థ పరిధిలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను చిత్తూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులు శంకర ప్రసాద్ శర్మ మంగళ వారం పరిశీలించారు. నగరపాలక సంస్థ పరిధిలోని కట్టమంచి నగరపాలక ప్రాధమిక పాఠశాల,షర్మన్ బాలికల పాఠశాల,పీసీఆర్ జూనియర్ కళాశాల లోని పలు పోలింగ్ కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన పోలింగ్ కేంద్రాల పరిధిలో చేపట్టిన కనీస మౌలిక సదుపాయాలను ఆయన పరిశీలించారు.పోలింగ్ కేంద్రాల వారీగా చేపట్టిన ఏర్పాట్లు, రూట్ మ్యాప్‌లను, పోలింగ్ కేంద్రాల లేఅవుట్‌లనను ఏఆర్‌ఓ, మున్నిపత్ కమీషనర్, జె.అరుణ ఎన్నికల వ్యయ పరిశీలకువివరించారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపా యాల ఏర్పాట్లు బాగున్నాయని వ్యయ పరిశీలకులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో ఎంఈ గోమతి, ఎంహెచ్‌ఓ డాక్టర్ అనిల్‌కుమార్ నాయక్, డీఈలు, ఏఈలు, శానిటరీ ఇన్స్‌పెక్టర్‌లు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

## నీటి సమస్యపై చర్చించేందుకు కూడా తీరిక లేకపోయే !!

– నామమాత్రంగా హాజరైన ప్రజాప్రతినిధులు

మమ అన్పించి మండల మీట్ ముగించారు!!

కుప్పం, ఏప్రిల్ 30 ప్రభాతవార్త



అసలే ఎన్నికల కోడ్.. ఆపై వేసవి.. మూడు నెలలకు ఓ సారి జరిగే మండల సమావేశంలో తమ గ్రామాల్లో నెలకొన్న నీటి ఎద్దడిని అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే అంశంలో ప్రజాప్రతినిధులు చాలావరకు ముందుకు రాలేదు. మంగళవారం ఎంపిపి అశ్విని అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కాగా సమావేశానికి ఎంపికైన ప్రజాప్రతినిధులు కేవలం కోరంకు తగిన విధంగా రావడంతో సమావేశం మొదలు పెట్టారు. చాలావరకు మండలంలో వైఎస్సార్సీ తరపున ఎంపికైన సర్పంచులు, ఎంపిటిసిలు అధికంగా ఉనా ్న వీరు సమావేశానికి నామమాత్రంగా హాజరయ్యారు. దీంతో వచ్చిన సభ్యులు తమ గ్రామాల్లో ఉన్న నీటి సమస్యను ప్రస్తావించడం ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు వాటిని రాసుకుని పరిష్కరిస్తామని చెప్పడంతో సమావేశంను ముగించేశారు. గతంలో ఎన్నడూలేని విధంగా ఎండల ధాటికి గ్రామాల్లో మంచినీటి సమస్య ఉత్పన్నమవుతోంది. అయితే ఈ సమస్యను పరిష్కరించేందుకు చొరవ చూపాల్సిన ప్రజాప్రతినిధులు 'ఎన్నికల హడావిడి'లో పడి సమావేశానికి వచ్చేందుకు సైతం పెద్దగా ఉత్సాహం చూపకపోవడం గమనార్హం.

## ఎమ్మెల్సీ డా॥ కంచర్ల సమక్షంలో తెదేపాలో భారీగా చేరికలు

కుప్పం, ఏప్రిల్ 30 ప్రభాతవార్త



శాంతిపురం మండలంకు చెందిన యువత అధిక సంఖ్యలో తెలుగుదేశం పార్టీలో చేరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్, ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం, రాష్ట్ర కార్యదర్శి డా॥ బిఆర్ సురేష్‌బాబుల సమక్షంలో వారు తెదేపాలో చేరారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వంపై యువత ఏస్థాయిలో ఆగ్రహం ఉందో చెప్పేందుకు ఈ చేరికలు నిదర్శనమన్నారు. ఉద్యోగాల నియామకాలు చేపట్టని జగన్ యువత ఆగ్రహానికి గురికాకతప్పదన్నారు. కార్యక్రమంలో నేతలు విశ్వనాథనాయుడు, జనార్ధనరెడ్డి, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

## కుప్పంకు 582 ఇవిఎం మిషన్లు కేటాయింపు

– రిటర్నింగ్ అధికారి శ్రీనివాసులు

కుప్పం, ఏప్రిల్ 30 ప్రభాతవార్త

కుప్పం నియోజకవర్గంలోని కుప్పం, శాంతిపురం, రామకుప్పం, గుడుపల్లె మండలాలకు గాను ఎన్నికలకు సంబంధించి ఉన్నతాధికారులు 582 ఇవిఎం మిషన్లను కేటాయించినట్లు ఆర్డీఓ, కుప్పం రిటర్నింగ్ అధికారి శ్రీనివాసులు తెలిపారు. పార్లమెంట్ ఎన్నికలకు 291, అసెంబ్లీ ఎన్నికలకు 291వంతున ఇవిఎంలు కేటాయించారన్నారు. మొత్తం 243 పోలింగ్ బూత్‌లు ఉన్నాయన్నారు. అలాగే 630 వివి ప్యాట్లు కేటాయించారన్నారు. వీటిని కుప్పంలోని ఎంఎఫ్‌సి ప్రభుత్వ కళాశాలలో ఏర్పాటుచేసిన స్ట్రాంగ్‌రూమ్‌లో గట్టి భద్రత ఏర్పాట్ల మధ్య భద్రపరచినట్లు తెలిపారు.

## మైనార్టీలను ఆదుకుంది చంద్రబాబే

– రాష్ట్ర మైనార్టీ సంక్షేమ విభాగం అధ్యక్షుడు రఫీ

కుప్పంరూరల్, ఏప్రిల్ 30 ప్రభాతవార్త



రాష్ట్రంలో ఉన్న మైనార్టీలను ఆదుకుంది తెదేపా అధినేత చంద్ర బాబునాయుడేనని రాష్ట్ర మైనార్టీ సంక్షేమ విభాగం అధ్యక్షుడు షేక్ రఫీ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో చంద్రబాబు పాలనలో మైనార్టీలకు రంజాన్, షాదీతోఫా, దుకాన్–మకాన్ పథకం, కార్పోరేషన్ రుణాలు అందించి ఆదుకున్నారన్నారు. సిఎం జగన్ ఈ పథకాలు రద్దు చేశారన్నారు. మైనార్టీలకు మేలు చేస్తున్న చంద్రబాబుకు తాము మద్దతు పలుకుతున్నట్లు ప్రకటించారు. రాష్ట్ర సీనియర్ నేత ఇక్బాల్ మాట్లాడుతూ ఎన్డీయే కూటమి అధికారంలో రాగానే మైనార్టీలకు యాభై ఏళ్లకే పెన్షన్ అమలు చేస్తామని ప్రకటించడం హర్షణీయమన్నారు. అలాగే ఇమాంలకు పదివేలు, మౌజన్‌లకు ఐదువేల వంతున వేతనాలు చెల్లిస్తామని, నూర్ బాషా కులస్తులకు వందకోట్లతో కార్పోరేషన్ ఏర్పాటుచేస్తామని ప్రకటించడం ఆనందంగా ఉందన్నారు. మైనార్టీలకు నాలుగుశాతం రిజర్వేషన్లు కొనసాగేలా చంద్రబాబు పనిచేస్తారన్నారు. సమావేశంలో నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షుడు జాకీర్, మాజీ ఎంపిటిసి హిదయతుల్లా, ప్రధాన కార్యదర్శి చాంద్‌బాషా పాల్గొన్నారు.

## ఓటర్లుకు నగదు, అక్రమమద్యంపై పంపిణీపై సమాచారమివ్వండి

జిల్లా కలెక్టర్ షగిలి షన్మోహన్

చిత్తూరు, ఏప్రిల్ 30 ప్రభాతవార్త:

సాధారణ ఎన్నికలు–2024 ఎన్నికల ప్రవర్తనా నియావళికి సంభందించి నియమావళి ఉల్లంఘించి జిల్లాలో ఎక్కడైనా అక్రమమద్యం నిల్వలు, బహుమతులు, ఓటర్లుకు నగదు పంపిణీ చేస్తున్నట్లు సమాచారం వుంటే జిల్లా ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందం శిక్షణా డిప్యూటీ కలెక్టర్ కె.లక్ష్మీ ప్రసన్న ఆధ్వర్యంలో పనిచేసే బృందంకు ఫిర్యాదు చేయవచ్చునని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షగిలి షన్మోహన్ తెలిపారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా వుంచడం జరుగుతుందన్నారు. అక్రమమద్యం, ఓటర్లుకు నగదు పంపిణీపై సమాచారం అందించాల్సిన ఫోన్‌నెంబర్లు వివరాలు కె.లక్ష్మీ ప్రసన్న శిక్షణా డిప్యూటీ కలెక్టర్ సెల్ నెం.9603404789, శేషగిరి సబ్ ఇన్స్‌పెక్టర్ ఆఫ్ పోలీస్ నె.9849962578, పి.కృష్ణకిషోర్ పీఅండ్ ఈఈ ఎస్ఐ నెం.8019396602, వై.విజయభాస్కర్, డివిజన్ పరిపాలనాధికారి నెం.9491077011కు సమాచారం అందించాలన్నారు.

## మరో ఐదేళ్ళలో ప్రగతి సాధనకు కార్యాచరణ

–పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

పుంగనూరు, ఏప్రిల్ 30 ప్రభాతవార్త :



పుంగనూరు నియోజకవర్గాన్ని మరో ఐదేళ్ళలో మరింతగా వృద్దిలోనికి తీసుకువచ్చేందుకు ప్రగతిసాధన కార్యాచరణ సిద్దంచేస్తున్నామని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. ఆయన అధ్వర్యంలో తూర్పు మొగసాల,తదితర ప్రాంతాలలో పలువురు యువకులు వైకాపాలో చేరారు. ఈస్ట్‌పేట యూత్ తో పాటూ మైనార్టీలు కూడా వైకాపాలో చేరుతన్నట్లు ప్రకటించడంతో ఆయన వారికి కండువాలు కప్పి పార్టీలోనికి ఆహ్వానించారు. పార్టీ జిల్లా నాయకుడు జి.ప్రభు అధ్వర్యంలో మంత్రికి వాడవాడలో ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఆయన వెంట ఆర్టీసి మజ్దూర్‌యూనియన్ ఛైర్మన్ జయరామిరెడ్డి,జి.ప్రభు, ఎన్.శ్రీనాధరెడ్డి,అనీషారెడ్డి, కొండవీటి నాగభూషణం, ఛైర్మన్ అలీంబాషా, ఆవుల అమర,వేలుమొదలి,బ్రాహ్మణసంఘ అధ్యక్షు డు రామకృష్ణ,జయరామిరెడి ్డ,సురేష్, రాజేష్,అజ్మ,శీన, తుంగామంజునాథ్, తదితరులు పాల్గొ న్నారు.

## మైనార్టీలు సంక్షేమం కోసం టిడిపి అంకితం

పుంగనూరు, ఏప్రిల్ 30 ప్రభాతవార్త :



తెలుగుదేశంతోనే మైనార్టీల సంక్షేమం సాధ్యమౌతుందని,పార్టీ మైనార్టీ నాయకుడు సయ్యద్‌సుహేల్ అన్నారు. పుంగనూరు పట్టణంలోని నాగపా ్రలెం,చర్చివీధిప్రాంతాలలో మైనార్టీ విభాగం అధ్వర్యంలో ఇంటింటికి వెళ్ళి ప్రజలను కలిశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మైనార్టీల షాదీమహాల్ ఏర్పాటుతో పాటూ మైనార్టీల కుటుంబాలలో పిల్లలకు ఉన్నత విద్యల సదుపాయం కల్పించిన ఘనత దేశందేనన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా చేపట్టిన విద్యాసంస్కరణలతో తమ కుటుంబాల లక్షాది మంది ఇంజనీర్లు,డాకర్లుగా ఉన్నత స్థాయికి ఎదిగారన్నారు. తరాలుగా ముస్లింలు నమ్మిన తెలుగుదేశంపార్టీతోనే రాష్ట్రానికి పూర్వవైభవం సాధ్యమౌతుందన్నారు. కార్యక్రమంలో అబ్బాస్,గిరి, ఫయాజ్,రఫీ,అనీస్,ఖదీర్‌తో పాటూ పలువురు పాల్గొన్నారు.

## చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## ఆర్‌బికలకు చేరుకున్న విత్తన శెనక్కాయలు

చౌడేపల్లి, ఏప్రిల్ 30 ప్రభాతవార్త



మండలంలోని పలు ఆర్‌బికేలకు విత్తన శెనక్కా యలు చేరుకొన్నాయి. మండలానికి 1620క్విం టాళ్ళు అవసరముండగా ఇప్పటి వరకు 780క్విం టాళ్ళు మంజూరయ్యాయని వ్యవసాయాధికారిణి జ్యోతమ్మ తెలిపారు. విత్తన శెనక్కాయల రాయితీ, పంపిణీ విధానంపై మార్గదర్శకాలు రాలేదనీ, వచ్చిన వెంటనే పంపిణీ చేస్తామన్నారు.

## నడివీధి గంగమ్మ వెండి పాదాలు ఊరేగింపు

చౌడేపల్లి, ఏప్రిల్ 30 ప్రభాతవార్త



శ్రీరామ్ కుటుంబ సభ్యులు నడివీధి గంగమ్మ వెండి పాదాలను ఊరేగింపుగా తీసుకెళ్ళి జాతర కమిటీ సభ్యులకందించారు. బజారువీధి నుంచి శ్రీరామ్ కుటుంబీకులు గోపాల్, ప్రభావతమ్మ, జగదీష్, హిమబిందులు బంధువులు, స్నేహిలతో కలసి స్థానిక మృత్యుంజయేశ్వరస్వామి ఆలయానికి చేరుకొన్నారు. అక్కడ నడివీధి గంగమ్మ జాతర కమిటీ సభ్యులకు రూ. 1.50లక్షల విలువ చేయు అమ్మవారి వెండి పాదాలను విరాళంగా అందించారు. నడివీధి గంగమ్మ జాతర కమిటీ నిర్వాహకులు, స్థానికులు పాల్గొన్నారు.

## పిల్లల మనో ఉల్లాసానికి వేసవి శిక్షణా శిబిరాలు

చిత్తూరురూరల్, ఏప్రిల్ 30 ప్రభాతవార్త:



ఒకప్పుడైతే పిల్లలను సెలవులకు వాళ్ల తాతయ్య ఊరికో, మావయ్య ఊరికో పంపి తల్లిదండ్రులు కాస్త ఊపిరి పీల్చుకొనేవారు, కానీ ఇప్పుడా పరిస్థితులు దాదాపు కనుమరుగై ఈ కంప్యూటర్ యుగంలో ఎవరింటికి వారు పరిమితమై ఇస్టాగ్రాం, ఫేస్‌బుక్, వాట్స్అప్, గేమ్స్ వంటి సోషల్ మీడియాతో గడుపుతూ తమ విలువైన సమయాన్ని వృధా చేసుకోవడంతో పెడతోవన పడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో పిల్లలతో ఇబ్బందులు ఎదుర్కొనే తల్లిదండ్రుల కోసం రాష్ట్ర ప్రభుత్వం అన్ని పట్టణాల్లో వేసవిశిక్షణా శిబిరాలను ప్రారంభించారు. ఇందులో భాగంగా చిత్తూరు పట్టణంలోని తపోవనం హైస్కూల్ నందు జిల్లా బాలభవన్ ఆధ్వర్యంలో ఈనెల 24వ తేది వేసవి శిక్షణా శిబిరంను జిల్లా ఉపవిద్యాశాఖాధికారి ప్రారంభించారు.

**వేసవి శిక్షణా శిబిరాలకు విశేష ఆదరణ :** డ్రాయింగ్ టీచర్ రామచంద్రారెడ్డి

వినోదం, విజ్ఞానం కలగలసి శిక్షణా శిబిరంలో లభించడంతో క్రమంగా ఆదరణ పెరుగుతోందని డ్రాయింగ్ టీచర్ రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. ఈ శిక్షణ శిబిరంలో విద్యార్థులకు వారివారి అభిరుచులకు అనుగుణంగా చిత్రలేఖనం, పేపరు కట్టింగ్, కలరింగ్ అతి సులభపద్దతిలో ప్రతిరోజు ఉదయం 7.30 గంటల నుంచి 10.30గంటలవరకు, అలాగే సాయంత్రం 4గంటలనుంచి 7,00గంటల వరకు తరగతులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. . ముఖ్యంగా తల్లిదండ్రులు వారి వారి పిల్లలను ప్రోత్సహించి వేసవి శిక్షణా శిబిరాలను పంపాలని, అలాగే శిక్షణా అనంతరం విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు ప్రదానం చేయడం జరుగుతుందని రామచంద్రారెడ్డి పేర్కొన్నారు.

## గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## జగన్ ప్రభుత్వంలోనే పేదలకు సంక్షేమ పథకాలు

వాకాడు, ఏప్రిల్ 30, ప్రభాతవార్త



దేశ చరిత్రలోనే ఏ ముఖ్యమంత్రి చేపట్టిన సంక్షేమ పథకాలను మన రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం లోనే సంక్షేమ పథకాలను పేదలకు పూర్తి స్థాయిలో అందించారని వైకాపా గూడూరు అభ్యర్థి మేరిగా మురళీధర్ అన్నారు. మంగళవారం మండలంలోని రావిగుంటపాలెం, నిడిగుర్తి, పూడి రాయి దొరపు, మూల పడవ పంచాయితీ గ్రామాలలో మురళీధర్ తిరిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలోనే అనేక సంక్షేమ అభివృద్ధి పథకాలు ద్వారా పేదలు అభివృద్ధి చెందారన్నారు. ముఖ్యంగా తీరప్రాంత గ్రామాలలో విద్య, విద్యతో పాటు మౌలిక సదుపాయాలు కల్పించాలన్నదే తన లక్ష్యమని గ్రామ ప్రజలకు మురళీధర్ అన్నారు. ఈ ప్రాంత నాయకులతో కలిసి పనిచేయడం అంటే తనకు ఎంతో ఇష్టమని సంక్షేమం, అభివృద్ధి వారందరితో కలిసి చేయడమే తనకు ఎంతో ఇష్టమన్నారు. ఈ ప్రాంత నాయకులు, కార్యకర్తలు, ప్రజలే నన్ను ఆశీర్వదించి నాతోపాటు తిరుపతి ఎంపి అభ్యర్థి గురుమూర్తిని కూడా ఆశీర్వదించి మా ఇద్దరికీ అత్యధిక ఓట్లు వేసి గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కొడవలూరు దామోదర్ రెడ్డి, సర్పంచ్ సంఘం అధ్యక్షుడు దువ్వూరు విజయ్ భాస్కర్ రెడ్డి, వ్యవసాయ శాఖ మండల అధ్యక్షులు అజిత్ కుమార్ రెడ్డి, సర్పంచ్ నాగరాజు, మూల పడవ సర్పంచి కిషోర్ కుమార్, ఉప సర్పంచ్ వెంకటరత్నం, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు వెంకటరమణయ్య, నిర్మల, వైకాపా జిల్లా ప్రధాన కార్యదర్శి మధుసూధన్ రెడ్డి, ఏఎంసి డైరెక్టర్ జనార్ధన్ రెడ్డి, జెసిఎస్ కన్వీనర్ సుధాకర్ నాయుడు, ఉప సర్పంచ్ పాపారెడ్డి రాజశేఖర్ రెడ్డి, మహేంద్ర, పెళ్లూరు కోటిరెడ్డి,నాయకులుకార్యకర్తలుపాల్గొన్నారు.ప్రతిచోటాహారతులతో , బాణాసంచాలతో స్వాగతం పలికారు.

## ఎంపీగా గెలిపిస్తే అభివృద్ధి చేసి చూపిస్తా..

తిరుపతి ఎంపి అభ్యర్థి వెలగపల్లి వరప్రసాద్ రావు

గూడూరు, ఏప్రిల్ 30 ప్రభాతవార్త



ఎంపీగా గెలిపిస్తే సంవత్సరంలోపు సముద్ర ముఖద్వారాలను ఓపెన్ చేయిస్తామని పులికాట్ సరస్సులో కేంద్ర పర్యావరణ శఖ ఆంక్షలు సడలిస్తామని తిరుపతి బిజెపి పార్టీ ఎంపి అభ్యర్థి వరప్రసాద్ వెల్లడించారు. గూడూరు పట్టణంలోని సనత్ నగర్‌లో తిరుపతి బిజెపి ఎంపి అభ్యర్థి వరప్రసాద్ విలేకరుల సమావేశం నిర్వహించారు. రిటైర్డ్ బ్యాంక్ మేనేజర్ నరసప్ప బీజేపి పార్టీలో చేరారు. ఆయనకు వరప్రసాద్ రావు పార్టీ కండువా కప్పి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వరప్రసాద్ రావు మాట్లాడుతూ బిజెపి, టిడిపి, జనసేన కూటమి ఎంపి అభ్యర్థిగా పోటీ చేస్తున్నామని ఎంపీగా గెలిపిస్తే గూడూరు మున్సిపాలిటీకి అమృత పథకంతో సమానంగా నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేస్తామని, ఫ్లై ఓవర్ బ్రిడ్జి ఆటో నగర్ నిర్మాణం వేగవంతంగా జరిగేలా చూస్తామని వెల్లడించారు. ఎంపీగా నన్ను, ఎమ్మెల్యేగా పాశం సునీల్ కుమార్‌ను గెలిపిస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా గూడూరు నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో చంద్రప్ప, పురుషోత్తం రెడ్డి, వెంకటసుబ్బయ్య, మన్యం శ్రీనివాసులు, బాలకృష్ణ నాయుడు, వినిష్, దిలీప్,పాల్గొన్నారు.

## 5 నుంచి పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ

కోట, ఏప్రిల్ 30 ప్రభాతవార్త

ఎన్నికల విధుల్లో పాల్గొనే పిఓ, ఏపిఓ, ఓపిఓ, అత్యవసర సర్వీసుల్లో విధులు నిర్వహిస్తున్న వారికి పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కును ఎన్నికల సంఘం కల్పించింది. మే 5 నుంచి 8వ తేదీ వరకు ఆయా నియోజకవర్గ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్లలో పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తు చేసుకునే వారికి ఓటింగ్ ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు కోట మండల తహశీల్దార్ నాగరాజన్‌రావు తెలిపారు. ఆయా నియోజకవర్గాల్లో ఓటర్లు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ ప్రక్రియలో పాల్గొనాలని ఆయన కోరారు.

## బ్యాంకు ఖాతాల్లో జమకాకపోతే ఇళ్ల వద్దకు పింఛన్లు పంపిణీ

కోట, ఏప్రిల్ 30 ప్రభాతవార్త

ఎన్నికల ప్రవర్తన నియమావళికి లోబడి సామాజిక పింఛన్ పంపిణీ జరుగుతుందని ఎంపిడిఓ శంకరయ్య తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ డిబిటి ద్వారా ఎవరికైనా మే 2వ తేదీలోగా పింఛన్ నగదు బ్యాంకుల ఖాతాల్లో జమ కాకపోతే 3 నుంచి 5వ తేదీలోగా నగదు రూపంలో ఇళ్ల వద్దకు వెళ్లి లబ్ధిదారులకు అందజేస్తారని తెలిపారు. లబ్ధిదారులు ఎవరూ ఎక్కడికీ వెళ్లాల్సిన అవసరం లేదన్నారు.

## 13 మంది వాలంటీర్లు రాజీనామా

కోట, ఏప్రిల్ 30 ప్రభాతవార్త

కోట మండలంలోని 13 మంది వాలంటీర్లు మంగళవారం రాజీనామాలు చేసినట్లు ఎంపిడిఓ శంకరయ్య తెలిపారు. చెందోడు నుంచి ఒకరు, వంజివాక నుంచి ఒకరు, సిద్దవరంలో ఐదుగురు, కొక్కుపాడులో ఐదుగురు, కోటలో ఒకరు చొప్పున రాజీనామాలు చేసినట్లు పేర్కొన్నారు. వారి రాజీనామాలను ఆమోదించామని తెలిపారు.

## టిడిపిలో పలువురు చేరిక

సూళ్లూరుపేట, ఏప్రిల్ 30 ప్రభాతవార్త



సూళ్లూరుపేట మండల పరిధిలోని పలువురు వైసీపీ కార్యకర్తలు ఆ పార్టీని వీడి మంగళవారం టీడీపీలో చేరారు. ఇసనాక శ్రీవాణి ఆధ్వర్యంలో కోటపోలూరు, తదితర ప్రాంతాలకు చెందిన కార్యకర్తలు.. టీడీపీ నాయకులు, పారిశ్రామికవేత్త కొండేపాటి గంగాప్రసాద్ స్వగృహం వద్ద టీడీపీలో చేరారు. వీరిని తిరుపతి పార్లమెంటరీ టీడీపీ అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈకార్యక్రమంలో బొమ్మన్ పళణి తదితరులు పాల్గొన్నారు. దివంగత నేత, చెంగాళమ్మ ఆలయ ట్రస్టుబోర్డు మాజీ ఛైర్మన్ ఇసనాక హర్షవర్ధన్‌రెడ్డి సతీమణి ఇసనాక శ్రీవాణి ఇటీవలే చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరి పార్టీ అభ్యర్థి విజయం కోసం విశేషంగా కృషి చేస్తున్నారు.

## పేదల సంక్షేమం కోసం ఉపయోగపడే విధంగా మేనిఫెస్టో

కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి టౌన్, ఏప్రిల్ 30, ప్రభాతవార్త



ఉమ్మడి మేనిఫెస్టో పేదల సంక్షేమంకు ఎంతగానో ఉపయోగపడే విధంగా ఉందని టిడిపి అభ్యర్థి కురుగొండ్ల రామ కృష్ణ తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ పేదలందరికీ ఉపయోగ పడే విధంగా మేనిఫెస్టో మాజీ సిఎం చంద్రబాబు నాయుడు జనసేన, బిజెపి వారు రూపొందించినట్లు తెలిపారు. పింఛను 4000 రూపాయిలకు పెంచారని తెలిపారు. సిఎం జగన్మోహన్ రెడ్డి రూపొందించిన మేనిఫెస్టో వాళ్ళ నాయకులకు ఉపయోగపడే విధంగా ఉందన్నారు. ప్రభుత్వం వద్ద ఎలాంటి నిధులు లేవని జగన్మోహన్ రెడ్డి చేతులెత్తేసారని తెలిపారు. వెంకటగిరి నియోజకవర్గంలో తాను చేసిన అభివృద్ధి తప్ప ఇంకేమి జరగలేదని తెలిపారు. సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు చంద్రమౌళి రెడ్డి, నాయకులు ఉన్నారు.

## ఇంటర్నేషనల్ అథ్లెటిక్‌లో విజేతకు అభినందనలు

కోట,ఏప్రిల్ 30 ప్రభాతవార్త



కోట మండలం ఊనుగుంటుపాళెం క చెందిన క్రీడాకారుడు వలిపి హిమతేజ విద్యా నగర్‌లోని ఎన్‌బీకేఆర్ సైన్సు అండ్ ఆర్ట్స్ కళాశాలలో డిగ్రీ చదువుతున్నాడు. ఆమేరకు ఏప్రిల్ 27 న దుబాయిలో జరిగిన 21 వ అండర్ ఇంటర్నేషనల్ అద్లెటిక్ పోటిల్లో 4..100 విభాగంలో ఇండియా తరపున వల్లిపి హిమతేజ పాల్గొన్నారు. ఆమేరకు కాంస్య పతాకంను సాధించారు. ఈ నేపధ్యంలో మంగళవారం కళాశాలలో హిమ తేజను కళాశాల ప్రిన్సిపల్ రామకృష్ణారెడ్డి జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ శారద, కో ఆర్డినేటర్ రాజశేఖర్‌లు అభినిందించారు.ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ హిమతేజ భవిష్యత్‌లో ఇండియాకు మరిన్ని పతాకాతలను తీసుకోనిరావాలని వారు కోరారు. ఎన్‌బీకేర్ పేరు ప్రతిష్టలను దేశ స్ధాయిలో హిమ తేజ నిలిపారు. గత సంవత్సరం కూడా దక్షణ కొరియాలో జరిగిన అద్లెటిక్‌లో పోటిల్లో ఇండియాకు కాంస్య పతకాన్ని సాధించారు. హిమ తేజ తండ్రి వలిపి వెంకటేశ్వర్లు,చిల్లకూరు పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్ పని చేస్తున్నారు.

## రాంకుమార్ రెడ్డి ఆధ్వర్యంలో టిడిపి నుండి వైసిపిలో చేరిక

బాలాయపల్లి, ఏప్రిల్ 30, ప్రభాతవార్త



మాజీ ఏఎంసి ఛైర్మన్ వెందోటి మధు రెడ్డి, మండల వైసిపి అధ్యక్షులు వెందోటి కార్తీక్ రెడ్డిల ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ సాగునీటి మాజీ అధ్యక్షులు శివాడి సుధాకర్ రెడ్డి, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ముద్దు శ్రీనివాసులు, తెలుగుదేశం పార్టీని వీడి వైసిపిలో చేరారు. వెంకటగిరి నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి వారికి వైసిపి కండువాను కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం వారితో మాట్లాడుతూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. తెలుగుదేశం పార్టీని వీడి వైసిపిలోకి టిడిపి నుండి వలసలు వస్తున్నట్లు తెలిపారు.

## 3995మందికి నేరుగా పింఛన్ల పంపిణీకి చర్యలు

కుప్పంరూరల్, ఏప్రిల్ 30 ప్రభాతవార్త

కుప్పం మున్సిపాలిటీ, మండల పరిధిలో బ్యాంకు ఖాతాలు లేని 3995మందికి నేరుగా పింఛన్ల పంపిణీకి చర్యలు తీసుకున్నట్లు మున్సిపల్ కమీషనర్ నాగేశ్వరరావు, ఎంపిడిఓ ఖాదర్‌బాషా తెలిపారు. కుప్పం మున్సిపల్, మండల పరిధిలో మొత్తం 14758మంది పింఛను లబ్దిదారులు ఉన్నారన్నారు. బ్యాంకు ఖాతాలు కలిగిన 10763మంది ఖాతాల్లోకి ప్రభుత్వమే నేరుగా పింఛన్ల నగదు జమ చేస్తుందన్నారు. బ్యాంకు ఖాతాలు లేనివారి బయోమెట్రిక్‌ను సేకరించి వారికి కూడా జూన్ నెలలో పింఛన్లు బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## అధికారంలో రాగానే కుప్పానికి ప్రత్యేక మేనిఫెస్టో అమలు

– ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్

కుప్పం, ఏప్రిల్ 30 ప్రభాతవార్త



అధికారంలో రాగానే కుప్పానికి ఇరవై అంశాలతో రూపొందించిన ప్రత్యేక మేనిఫెస్టోను అమలు చేస్తామని ఎమ్మెల్సీ, సమన్వయ కమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన కూర్మాయిపురంలో వైకాపాకు చెందిన మధు అతని కుటుంబీకులు, పలువురు తెదేపాలో చేరారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 2014–19 మధ్య కాలంలోనే కుప్పంలో రెండువేల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. వైకాపా పాలనలో పడకేసిన కుప్పం అభివృద్ధిని ఎన్డీయే ప్రభుత్వం రాగానే పట్టాలెక్కిస్తామన్నారు. కుప్పానికి ప్రపంచపటంలో ఓ గుర్తింపు తెచ్చిన వ్యక్తి చంద్రబాబు అని ఈసారి ఆయనను లక్ష ఓట్ల మెజార్టీతో గెలిపించేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. ఈసందర్భంగా కూర్మాయిపురంలో బాబురుణం తీర్చుకుందాం కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమాల్లో రాష్ట్ర నేత గోపీనాథ్, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, క్లస్టర్ ఇన్‌చార్జ్ సత్యేంద్రశేఖర్, కొత్తపేట ఇన్‌చార్జ్ అప్పు, కౌన్సిలర్ సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.ఫోటో రైటప్ :

## బండారుపల్లిలో జయహో బిసి కరపత్రాలు పంపిణి

ఏర్పేడు, ఏప్రిల్30, ప్రభాతవార్త;



మండలంలోని బండారుపల్లి గ్రామంలో మంగళవారం జయహో బిసి సమావేశంలో భాగంగా తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే బిసిలకు కలిగే ప్రయోజనాల గురించి టిడిపి రాష్ట్ర బిసి కార్యదర్శి రెడ్డివారి గురవారెడ్డి వివరిస్తూ బిసిలకు రక్షణ చట్టం, 50 ఏళ్ల పైబడిన వారందరికి రూ.4వేలు పింఛను, అదేవిదంగా కులాలు, వర్గాల వారికి కూడా టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబునాయుడు పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. టిడిపి, జనసేన, బీజేపి ఉమ్మడి మ్యానిఫెస్టోలో పేదల కోసం, రైతులకోసం పలు సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు. ఈకార్యక్రమంలో బూత్ కమిటీ కన్వీనర్ రెడ్డివారి శివశంకర్, సుబ్రమణ్యం, దాము, ధనంజయరెడ్డి, శంకర్‌రెడ్డి, హరిరెడ్డి, సుబ్బన్న, మునిరత్నం, కాటారెడ్డి, బత్తిరెడ్డి, చినగురవయ్య తదితర టిడిపి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## అన్ని వర్గాల సమగ్రాభివృద్ధి లక్ష్యంగా మ్యానిఫెస్టో

గాలి భానుప్రకాశ్ హర్షం

**పుత్తూరు, ఏప్రిల్ 30 ప్రభాతవార్త :**



మరమగ్గాలకు నెలకు 500 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తామని టిడిపి మ్యానిఫెస్టోలో చంద్రబాబునాయుడు ప్రకటించడం పట్ల ఎన్డీఏ కూటమి నగరి నియోజకవర్గ అభ్యర్థి గాలి భానుప్రకాశ్ హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం పుత్తూరులో విలేకరులతో మాట్లాడుతూ రెండేళ్ల క్రితం నగరి పర్యటన సందర్భంగా చంద్రబాబునాయుడు పవర్ లూమ్స్‌కు ఉచిత విద్యుత్ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. యువగళం పాదయాత్ర సందర్భంగా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ కూడా ఈ విషయమై హామీ ఇచ్చారని తెలిపారు. వైసిపి అధికారంలోకి వచ్చాక విపరీతంగా పెంచిన విద్యుత్ ఛార్జీల వల్ల పవర్‌లూమ్స్ కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురైన విషయం తెలిసిందేనన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చాక అందించే ఉచిత విద్యుత్ సదుపాయంతో పవర్‌లూమ్స్‌కు పునర్ వైభవం వస్తుందని తెలిపారు. అన్నదాత పథకం కింద రైతులకు ఏడాదికి రూ. 20,000 వేలతో పాటు జగన్ ప్రభుత్వం రద్దు చేసిన అన్ని సబ్సిడీ పథకాలను పునరుద్ధరిస్తామని ప్రకటించడం శుభసూచకమని పేర్కొన్నారు. సమావేశంలో పుత్తూరు రూరల్ క్లస్టర్ ఇన్‌ఛార్జ్ గంజి మాధవయ్య, మాజీ ఎంపిపి డి.ఎస్.ఏలుమలై, పట్టణ, రూరల్ పార్టీల అధ్యక్షులు గాలి జీవరత్నంనాయుడు, రవికుమార్, ప్రధాన కార్యదర్శులు ఎస్.ఎస్.ధనపాల్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

## రాజులకండ్రిగలో తెలుగుదేశం పార్టీ ఆత్మీయ సమావేశం

ఏర్పేడు, ఏప్రిల్ 30,ప్రభాతవార్త;



మండలంలోని మడిబాక పంచాయతీ పరిధిలోని రాజులకండ్రిగ, మరియు కొత్తవీరాపురం అరుంధతి వాడ గ్రామంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పేరం ధనంజయులు నాయుడు ఆధ్వర్యంలో మంగళవారం తెలుగుదేశం పార్టీ ఆత్మీయ సమావేశాలు జరిగాయి. ముఖ్య అతిథిగా మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి సతీమణి బొజ్జల బృందమ్మ పాల్గొని మాట్లాడుతూ, తన భర్త బొజ్జల గోపాలకృష్ణారెడ్డి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు జరిగిన అభివృద్ధి తప్ప ఇప్పుడు ఎటువంటి అభివృద్ధి జరగ లేదన్నారు. ఈసారి వైసిపికి ఓటు వేస్తే మన ధన, మాన, ప్రాణాలకు రక్షణ లేకపోవడంతో పాటు మన తాత, ముత్తాతల నుంచి సాగుచేసుకుంటున్న భూములు కూడ మనకు దక్కవన్నారు. ఈ కార్యక్రమంలో మల్లిఖార్జున్ నాయుడు, జడ్పీటీసి తిరుమలయ్య, నాగరాజునాయుడు, శివాజి, చెల్లూరు సర్పంచి జనార్ధన్, కోబాక ఎంపీటీసి గౌరమ్మ, క్రిష్ణప్ప మొదలి, మునిరాజ యాదవ్, రాందాసు, మురగయ్య, రవి నాయుడు, హరినాయుడు, సతీస్,శశి తదితర టిడిపి నాయకులు, కార్యకర్తలు, రాజులకండ్రిగ,కొత్తవీరాపురం ప్రజలు పాల్గొన్నారు.

## టీడీపీ గెలుపే లక్ష్యంగా పని చేయాలి - గాలి భానుప్రకాష్

**విజయపురం, ఏప్రిల్ 30 ప్రభాతవార్త:**



తెలుగుదేశం పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరు పని చేయాలని నగరి నియోజకవర్గ కూటమి అభ్యర్థి గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని సూరికాపురం, సురికాపురం ఆది ఆంధ్రవాడకు చెందిన పలువురు వైసీపీ కార్యకర్తలు ఢిల్లీబాబు, మణి, సురేష్, మోహన్, చంద్రయ్య, అంకయ్య, మునస్వామి, ఆరుద్రయ్య, మునెయ్య, శంకర, వినోద్, జంగమ్మ, తదితర కుటుంబ సభ్యులు టీడీపీలో చేరారు. చర్చి చేరిన వారికి భానుప్రకాష్ పార్టీ కండువాలు కప్పి సాధారంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ పార్లమెంట్ అధికార ప్రతినిధి చినబాబు, పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పథకాలు కొనసాగాలంటే జగనన్నే మళ్లీ రావాలి

– మంత్రి రోజా

**విజయపురం, ఏప్రిల్ 30 ప్రభాతవార్త:**



రాష్ట్రంలో పేదల సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి రావాలని మంత్రి రోజా పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని జంబాడ, చిన్న జంబాడ, జంబాడ ఆది ఆంధ్రవాడ, విజయపురం గ్రామాల్లో కార్యకర్తలతో సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ చంద్రబాబు మోసపు మాటలను నమ్మి మోసపోవద్దని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. జగన్ అమలు చేయని హామీలు చెప్పారని, చేయదగినవి చెబుతారని తెలిపారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ గోపీనాథ్, సర్పంచ్ భాస్కర్‌రాజు, ఎంపీటీసీ సుబ్రహ్మణ్యం, నాయకులు వెంకటేష్, చెంచు వరప్రసాద్, సుబ్బు, హరినాయుడు, రవినాయుడు, బాలకృష్ణ నాయుడు, సతీష్ యాదవ్, నారపరాజు, శివరాజు, సరస్వతి, రాజగోపాల్, ప్రసన్న, కుమార్, బాబు, గోపిరాజు, మురళీకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీసుల కవాతు

**తొట్టంబేడు, ఏప్రిల్ 30 ప్రభాతవార్త**



మండలంలోని సమస్యాత్మక ప్రాంతాలైన విరూపాక్ష పురం,కొత్తకండ్రిగ, చోడవరం, చియ్యవరం, కాసారం గ్రామాల్లో తొట్టంబేడు ఎస్ఐ రాఘవేంద్ర ఆధ్వర్యంలో ప్రత్యేకబలగాలుతో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్ఐ రాఘవేంద్ర మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా ప్రతి ఒక్కరు తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని కోరారు. గ్రామాల్లో ఎక్కడైనా మద్యం, నగదు, ఓటర్లను ప్రలోభపెట్టే అంశాలు ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు.

## ముస్లిం మైనారిటీల పథకాలన్నింటిని వైసిపి ప్రభుత్వం రద్దు చేసింది

ముస్లీంల ఆత్మీయ సమావేశంలో పులివర్తి సుధారెడ్డి

**పాకాల, ఏప్రిల్ 30, ప్రభాతవార్త**



టిడిపి ప్రభుత్వంలో ముస్లిం మైనారిటీలకు ప్రవేశ పెట్టిన పథకాల న్నింటిని వైసిపి ప్రభుత్వం రద్దు చేసిందని చంద్రగిరి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని సతీమణి పులివర్తి సుధారెడ్డి ఆరోపించారు. మంగళవారం పాకాల పట్టణంలో నీలామలతి కళ్యాణ మండపంలో ముస్లీం ఆత్మీయ సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా పులివర్తి సుధారెడ్డి మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం మైనారిటీలకు ఏమి చేసిందని అన్నారు. రాష్ట్రంలో మైనార్టిల సంక్షేమం సంక్షోభంలో కూరుకుపోయిందన్నారు. టిడిపి, బిజెపితో కలవటం వల్ల ముస్లీం రిజర్వేషన్లుపోతాయనే ప్రచారంలో వాస్తవం లేదన్నారు. చంద్రబాబు ఎన్డీయే కూటమిలో ఉండగా ముస్లీంల హక్కులకు ఎప్పుడూ ఇబ్బంది రాలేదని అన్నారు. ఎన్నికల ముందు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ముస్లీం కోసం చేసిన వాగ్దానాలను నెరవేర్చకుండా మోసం చేశారని అన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తేనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని మరోసారి స్పష్టం చేశారు. సైకిల్ గుర్తుకు ఓటు వేసి పులివర్తి నానిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

## కష్ట కాలంలో ఆదుకున్న వారిని మరువకండి!

వాగవీడు వాసులతో ఆత్మీయ సమావేశం

శ్రీకాళహస్తిరూరల్,ఏప్రిల్ 30 ప్రభాతవార్త




శ్రీకాళహస్తి నియోజక వర్గంలో ఐదేళ్ళ పాటు ప్రజల్ని ఆదుకున్నదేవరో మరచి పోకూడదని కరోనా కష్టకాలంలో తమ ప్రాణాలను సైతం లెక్కచేయక ఆదుకున్న నాయకుని సేవల్ని ఉపయోగించుకోవాలని మంగళవారం శ్రీకాళహస్తి మండలంలోని వాగవీడు పంచాయతీలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో బియ్యపు పవిత్రారెడ్డి వివరించారు. వాగవీడు,దళితవాడ,చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ప్రజలతో ఆమె సమావేశమయ్యారు.ఈ సందర్భంగా ఆమె తన తండ్రి బియ్యపు మధుసూధనరెడ్డి నిరుపేదల కోసం అందించిన సేవలను వివరించారు.కరోనా కాలంలో తమకు కరోపా పాజిటివ్ వచ్చినా లెక్క చేయక ప్రజల సంక్షేమానికి వారిని ఆదుకోవటానికి కృషి చేసిన సంగతి మరచిపోరాదన్నారు.కష్టకాలంలో కనిపించని నాయకులు నేడు కుటుంబసమేతంగా రంగంలో దిగి అరచేతిలో స్వర్గం చూపుతున్నారని నమ్మితే మోసపోతారని వివరించారు.ఈ సమావేశంలో మండల అధ్యక్షుడు వయ్యాల కృష్ణారెడ్డి, వైస్ ఎంపిపి భానుమూర్తియాదవ్, సర్పంచ్ వనమ్మ, ఎంపిటిసి శివకుమార్,వాసుదేవరెడ్డి,బాల్‌రెడ్డి,వయ్యాల మనోహర్‌రెడ్డి, చెంచయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకాళహస్తిలో పల్లమాల ఆత్మీయ సమావేశాలు

5న కీలక సమావేశం

శ్రీకాళహస్తి,ఏప్రిల్ 30 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి రాజకీయ చరిత్రలో బుల్లితెర మాంత్రికుడు,నిర్మాత, మొగలిరేకులు, చక్రవాకం సీరియల్స్‌తో జనం హృదయాల్లో శాశ్వత స్థానం సాధించిన పల్లమాల సుధాకర్ తమ సామాజిక వర్గంతో ఆత్మీ య సమావేశాలు నిర్వహిస్తు న్నారు.రాబోవు ఎన్నికల్లో తమ మద్దతు ఇచ్చే టిడిపి అభ్యర్థి గెలుపు కోసం సహకరించాలని కోరుతున్నారు.ఈ నేపథ్యంలో ఈ నెల 5న వంగవీటి రాధాతో సమావేశం నిర్వహించుటకు కూడా ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. వారం రోజులుగా ఆయన తమ సహచరులతో సమాలోచనలు జరుపుకుంటూ ముందుకు సాగుతున్నారు. మంగళవారం ఆయన తమ సామాజిక వర్గం సమావేశంను నిర్వహించారు. రాబోవు రోజుల్లో తమ సామాజిక వర్గం సమాజంలో రాణించాలంటే మనం తెలుగుదేశంకు మద్దతుగా ఉండాలని కోరారు.అంతేకాక శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ప్రధాన సామాజిక వర్గాల్లో ఒకటిగా ఉన్న తమకు గుర్తింపు రావటానికి మద్దతుగా నిలవాలని పిలుపు నిచ్చారు.ఈ సమావేశంలో సిద్దులుగారి ప్రసాద్,కంఠారమేష్, డాక్టర్ పగడాల సుధాకర్,పల్లమాల శశాంక్, పసుపులేటి నవీన్‌కుమార్, పాపిశెట్టి ప్రసాద్;పుల్లయ్య, కొట్టేసాయి, కాసరం రమేష్, వజ్రం కిషోర్, హేమంత్, కిట్టు,గిరి తదితరులు పాల్గొన్నారు.

## జనంలోకి కాంగ్రెస్ సిద్ధాంతాలు

డాక్టర్ పోతుగుంట రాజేష్



శ్రీకాళహస్తి,ఏప్రిల్ 30 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి నియోజక వర్గంలో ప్రజల్లోకి కాంగ్రెస్ సిద్ధాంతాలు తీసుకెళతానని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ పోతుగుంట రాజేష్ పేర్కొన్నారు. రాజకీయ కుటుంబం నుంచి వచ్చిన డాక్టర్ పోతుగుంట రాజేష్‌కు పార్టీ టిక్కెట్టు కేటాయించటంతో మౌనంగా ముభావంగా ఉన్న కాంగ్రెస్ మద్దతు దారుల్లో జోష్ చోటు చేసుకుంది.రాజేష్ వృత్తి రీత్యా డాక్టర్ అయినప్పటికి ఇక్కడి రాజకీయ చదరంగంలో ఓ సిపాయిలా దూకారు. రాజేష్ తండ్రి పోతుగుంట గురవయ్యానాయుడు వృత్తిరీత్యా న్యాయవాది. అయితే రాజకీయాల్లో తమదైన శైలిలో మనగల్గినారు. ఆయన వారసుడుగా రాజేష్ మొదట తెలుగుదేశం పార్టీ టిక్కెట్టును ఆశించారు. ప్రయత్నించారు.కానీ సాధ్యం కాకపోవటంతో కాంగ్రెస్ పార్టీ టిక్కెట్టును సాధించారు. అధినేత్రి వైయస్ షర్మిల బహిరంగ సభను ఏర్పాటు చేసారు. వామపక్షాల మద్దతుతో పార్టీ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీకి జీవం పోయాలని పేద ప్రజల జీవితాల్లో వెలుగు నింపేది ఒక్క కాంగ్రెస్ పార్టీయే అని వివరిస్తూ కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన వరాలను పేదలకు వివరిస్తున్నారు. మార్పు కోసమే తాను రాజకీయాల్లోకి వచ్చానంటూ వివరిస్తు న్నారు.

## టిడిపి అధికారంలోకి వస్తే నడిచి విజయవాడకు

-గతంలో మోకాళ్ళపైకి తిరుమలకు

-ఓ తెలుగుదేశం నాయకుడి అభిమానం

.శ్రీకాళహస్తి, ఏప్రిల్ 30 ప్రభాతవార్త



ఈఎన్నికల్లో తెలుగుదేశంపార్టీ అధికారంలోకి వస్తే నడచి విడయవాడకు చేరుకుని కనకదుర్గమ్మను దర్శించుకుంటానని ఓతెలుగుదేశంపార్టీ నాయకుడు పేర్కొన్నాడు. గతంలో ఈయన తెలుగుదేశంపార్టీ అధినేత చంద్రబాబునాయుడు గెలిచినపుడు మెకాళ్ళపై తిరుమలకు చేరుకుని తలనీలాలు సమర్పించి తిరుమలేశుని దర్శించుకుని మొక్కుతీర్చుకున్నాడు. వివరాల్లోకి వెళితే..ఏర్పేడు మండలం గుండ్లకండ్రిగ గ్రామానికి చెందిన బి.వెంకటాచలపతి 1984-85 నుంచి తెలుగుదేశంపార్టీకోసం పనిచేస్తున్నాడు. కొన్ని అనివార్యకారణాల వల్ల కాంగ్రెస్‌పార్టీలో చేరి 1992-93 మాజీ ఎంఎల్ఏమబ్బురామిరెడ్డికి ప్రధాన అనుచరుడిగా పనిచేశాడు. తర్వాత 2001 నుంచి తెలుగుదేశంపార్టీ ఏర్పేడు మండల యువత అధ్యక్షుడుగా, నియోజకవర్గయువత కన్వీనర్‌గా పనిచేశారు. తిరుమలకు వస్తున్న చంద్రబాబునాయుడుపై బాంబ్‌బ్లాస్ట్ జరగ్గాఆయన కోలుకోవాలని తిరుమలేశుని దర్శనానికి మెకాళ్ళపై చేరుకుని స్వామివారిని దర్శించుకున్నాడు. ప్రస్తుత ఎన్నికల్లో రాష్ట్రంలో తెలుగుదేశంపార్టీ అధికారంలోకి రావాలని కోరుకుంటూ విజయవాడకు నడచి వెళ్ళి తలనీలాలు సమర్పిస్తానని అమ్మవారిని దర్శించుకుంటానని మొక్కుతీర్చుకుంటానని తెలిపాడు.

## వాలంటీర్ల సేవలను మరువం: రాజీనామాలతో నష్టపోవద్దు!

బొజ్జల సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తిరూరల్, ఏప్రిల్ 30 ప్రభాతవార్త



వాలంటీర్లసేవలను తెలుగుదేశం మరువ దని ఎవ్వరూ వైకాపా పార్టీ బెదిరింపులు డిమాండ్లకు భయపడి రాజీనామాలు చేసి నష్టపోవద్దని శ్రీకాళహస్తి తెలుగు దేశం అభ్యర్థి బొజ్జల వెంటకసుధీర్‌రెడ్డి పిలుపు నిచ్చారు. మండలంలోని చుక్కల నిడిగల్లు,తొండమనాడు,సుబ్బానాయుడుకండ్రిగ, రామలింగాపురం, ఎగువీధిల గ్రామాలకు సంబంధించిన పార్టీ ప్రముఖులతో తొండమనాడులో ఆత్మీయ సమావేశం నిర్వహించారు.రాష్ట్ర ప్రజలు వైకాపాను ఇంటికి పంపటానికి స్థిర నిర్ణయంతో ఉన్నారని గత ఐదేళ్ళు రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో దోచుకున్నారని ఈ వాస్తవాన్ని గుర్తించాలన్నారు. ఇక శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఐదేళ్ళ పాటు అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేసి దోచుకొని దాచుకొని సేవల పేరుతో మరో సారి వంచన చేయటానికి ప్రయత్నిస్తున్నారని ధ్వజమెత్తారు.ఇక వైకాపా నాయకులు వాలంటీర్లను భయపెట్టి రాజీనామాలకు డిమాండ్ చేస్తున్నారని ఏ వాలంటీర్ రాజీనామా చేసి తమ ఉద్యోగాన్ని పోగొట్టుకోవద్దన్నారు. రాబోయేది తెలుగుదేశం ప్రభుత్వమే కాబట్టి వారికి మంచి భవిష్యత్తు ఉంటుందని వివరించారు.

# తిరుపతి డివిజన్

## నేటి నుంచి బూత్‌స్థాయి అధికారులచే ఓటరు స్లిప్పులు పంపిణీ

–చంద్రగిరి రిటర్నింగ్ అధికారి నిషాంత్‌రెడ్డి

**తిరుపతిరూరల్, ఏప్రిల్ 30 ప్రభాతవార్త:**

ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు చంద్రగిరి అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి, ఆరు మండలాల ఓటర్లకు బూత్‌స్థాయి అధికారులచే మే 1వ తేదీ నుండి ఓటరు స్లిప్పులను పంపిణీ చేయబడునని రిటర్నింగ్ అధికారి నిషాంత్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఓటరు స్లిప్పుల పంపిణిలో ఎన్నికల కమీషన్ సూచనలను బూత్‌స్థాయి అధికారులు ఖచ్చితంగా పాటించాలన్నారు. 166–చంద్రగిరి ద్వారా బూత్‌స్థాయి అధికారులకు అవసరమైన నిర్థిష్టమైన ఖచ్చితమైన ఆదేశాలు జారీ చేయబడినట్లు తెలిపారు.

## స్వతంత్ర అభ్యర్థికి గాజు గ్లాస్ గుర్తు కేటాయింపు

–చంద్రగిరి అసెంబ్లీకి క్రేజీగా మారిన గ్లాస్ గుర్తు

**తిరుపతిరూరల్, ఏప్రిల్ 30 ప్రభాతవార్త:**

చంద్రగిరి అసెంబ్లీ బరిలో స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దిగిన పి.వెంకట కృష్ణ మూర్తికి ఎన్నికల అధికారులు గాజుగ్లాసు గుర్తును కేటాయించారు. గాజు గ్లాసు గుర్తు జనసేన పార్టీకి కేటాయించిన విషయం తెల్సిందే. స్వతంత్ర అభ్యర్థికి ఈ.సి. గాజుగ్లాసును కేటాయింపు, చంద్రగిరి అసెంబ్లీ నియోజకవర్గానికి ఓ క్రేజీ మారింది. గాజు గ్లాస్ గుర్తు పొందిన వెంకట కృష్ణ మూర్తిని నామినేషన్ విత్‌డ్రా చేసుకోవాలని కూటమి అభ్యర్థులు ప్రాధేయపడినట్లు సమాచారం. అదే తరహాలలో అధికార పార్టీ నాయకులు కూడా వెంకట కృష్ణ మూర్తికి వెన్నుదన్నుగా నిలిచి, స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దిగటానికి సహాయ సహకారాలు అందిస్తున్నట్లు సమాచారం. ఎందుకంటే కొన్ని ఓట్లయిన గాజుగ్లాసుకు పడతాయనే ఆలోచనలో ఉన్నట్లు ఉన్నారు.

## తిరుమలలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

తిరుపతి క్రీడ, ఏప్రిల్ 30, ప్రభాతవార్త



తిరుమలలోని రాంభగీచ జనరేటర్‌కు తూర్పు వైపున బాత్ రూమ్ నెం. 27కి పడమరవైపు ఉన్న ఖాళీ స్థలంలో ఒక గుర్తు తెలియని మగ వ్యక్తి (29) అపస్మారక స్థితిలో పడుకొని ఉండడంతో టిటిడి సెక్యూరిటీ సిబ్బంది గమనించారు. సదరు వ్యక్తితో మాట్లాడడానికి ప్రయత్నం చేయగా అతను ఏమి మాట్లాడక పోవడంతో చికిత్స నిమిత్తం 108 అంబులెన్సు ద్వారా తిరుమలలోని అశ్విని హాస్పిటల్‌కి తీసుకెళ్లగా, డ్యూటీ డాక్టర్ పరీక్షించి సదరు గుర్తు తెలియని వ్యక్తి అప్పటికే చనిపోయి ఉన్నాడని నిర్ధారించారు. చనిపోయిన సదరు వ్యక్తి మెరిన్ బ్లూ రంగు అడ్డ గీతల రెడీమేడ్ ఫుల్ షర్టు, రెడిమేడ్ నల్ల ప్యాంటు, ఒక పేట నలుపు రంగు మొలతాడు ధరించి ఉన్నాడు. సదరు మరణించిన వ్యక్తి యొక్క ఆచూకి తెలిసిన ఎడల 0877 - 2263654, 0877 - 2289027, 9440796771 నెంబర్‌కు సంప్రదించాలని తెలిపారు.

## ప్రాంగణ ఎంపికలలో సెవెన్ హిల్స్ విద్యార్థుల ప్రతిభ

రామచంద్రాపురం, ఏప్రిల్ 30

**ప్రభాతవార్త:**



వెంకట్రామాపురం సమీపంలోని సెవెన్ హిల్స్ ఫార్మశీ కళాశాల విద్యార్థులు ప్రాంగణ ఎంపికలలో ప్రతిభను కనబరిచా రు. మంగళవారం కళాశాలలో దివీస్ ల్యాబొరేటరీస్ సంస్థ నిర్వహించిన ప్రాంగణ ఎంపికలకు కళాశాలకు చెందిన 100 మంది విద్యార్థులు హాజరయ్యారు. వారికి కంపెనీ ప్రతినిధులు అమరనాథ్, పూర్ణప్రసాద్ వ్రాత పరీక్ష, మౌఖిక పరీక్షలు నిర్వహించి 65 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. ఎంపికైన విద్యార్థులకు ఏడాదికి రూ.2.50 లక్షలు వేతనంగా లభిస్తుందన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కరస్పాండెంట్ యం.సుమలత, ప్రిన్సిపాల్ డాక్టర్ యం.నిరంజన్ బాబు అభినందించారు.

## ముస్లింలను మోసం చేయాలని ప్రయత్నిస్తే పుట్టగతులుండవు

– మాహీన్

నగరి, ఏప్రిల్ 30 ప్రభాతవార్త:



చంద్రబాబు ముస్లింలను మోసం చేయాలని ప్రయ త్నిస్తే పుట్టగతు లుండవని వైసీపీ పార్టీ రాష్ట్ర మైనారిటీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాహీన్ తెలిపారు. మంగళవారం నగరిలో జరిగిన ముస్లింల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముస్లిం రిజర్వేషన్లు 4 శాతం తీసేస్తారని, ముస్లిం జీవితాలతో ఆడుకునే హక్కు చంద్రబాబుకు ఎవరిచ్చారని ఆయన ఆరోపించారు. బీజేపీ నేతలంతా తాము అధికారంలోకి వస్తే ముస్లిం రిజర్వేషన్లు తీసేస్తానంటున్నారని తెలిపారు. వాళ్ళతో ఆ ప్రకటనలు ఉపసంహరించుకునేలా చేసే దమ్ముందా ఇటీవల కేంద్ర మంత్రి పీయుష్ గోయల్ రాష్ట్రానికి వచ్చి ఇదే ప్రకటన చేశారని తెలిపారు. బీజేపీ అధికారంలోకి తిరిగి వస్తే ముస్లిం రిజర్వేషన్ తీసేస్తామంటే చంద్రబాబులో స్పందన లేదని, సుప్రీం కోర్టులో ఉంది అంటున్నారు. టీడీపీ హయాంలో ముస్లింలకు ఇచ్చిన హామీలు అమలు చేయమనఇ అడిగితే కేసులు పెట్టిన వ్యక్తి చంద్రబాబు అని కొనియాడారు. చంద్రబాబు హయాంలో 2,300 కోట్లు ఖర్చు పెడితే జగన్ 21 వేల కోట్లుకుపైగా ముస్లింల కోసం కేటాయించారు. తన మంత్రి వర్గంలో కాని, ఎమ్మెల్యే సీట్ల కేటాయింపు, ఎమ్మెల్సీలుగా ముస్లింలకు సముచిత స్థానం ఇచ్చిన వ్యక్తి జగన్ అని తెలిపారు. కార్యక్రమంలో ముస్లిం నాయకులు పాల్గొన్నారు.

## పర్మిషన్ లేకుండా ప్రచారం ఎలా చేస్తావు ఆరణి

దేవుని నమ్ముకున్న వ్యక్తి కరుణాకర్ రెడ్డి.. అమ్ముకున్న వ్యక్తి కాదు
రాష్ట్ర వైకాపా అధికార ప్రతినిధి నీలం బాలాజీ

**తిరుపతి హెల్త్, ఏప్రిల్ 30, ప్రభాతవార్త**



తిరుమల, తిరుపతి కలియుగ వెంకటేశ్వర స్వామి సన్నిధిలో ప్రచారం చేయడానికి అధికారుల పర్మిషన్ లేకుండా ప్రచారం ఎలా చేస్తావు ఆరణి శ్రీనివాసులు అని రాష్ట్ర వైకాపా అధికార ప్రతినిధి నీలం బాలాజీ ప్రశ్నించారు. మంగళవారం ఆయన పార్టీ కార్యాలయంలో ఆయన మాటాడుతూ తిరుమల తిరుపతి పవిత్రతను దెబ్బతీయడానికి ఆరణి శ్రీనివాసులు ఆగడాల ఎక్కువ అయ్యాయని ఆయన గుర్తు చేశారు. భూమన గురించి హేళనగా ఆరణి మాట్లాడటం తిరుపతి ప్రజలు గమనిస్తున్నారన్నారు. దేవున్ని అమ్ముకున్న వ్యక్తి కరుణన్న అని మాట్లాడడం తిరుపతి ప్రజల మనోభావాలను దెబ్బతీసినట్లు ఉందని కరుణాకర్ రెడ్డి దేవుని అమ్ముకునే వ్యక్తి కాదని దేవుని నమ్ముకునే వ్యక్తి అని తిరుపతి ప్రజలకు తెలుసన్నారు. టిడిడి ఉద్యోగులు 15000 మందికి పట్టాలు ఎలా ఇచ్చారని, అలాగే జీతాలు పెంచిన ఘనత ఒక కరుణన్నకే దక్కిందని అన్నారు. అంతే కాకుండా చంటి బిడ్డలకు మహాద్వార దర్శనం, వైకుంఠ ఏకాదశి సందర్భంగా తిరుపతి ప్రజలకు 10వేల మందికి వైకుంఠ ఏకాదశి రోజున దర్శనం కల్పించిన భాగ్యం కూడా ఒక కరుణాకర్ రెడ్డికే దక్కిందని ఆయన గుర్తు చేశారు.

## ముస్లిమ్‌ల జోలికొస్తే పుట్టగతులుండవు

వి.ఎం.మాహీన్

**పుత్తూరు, ఏప్రిల్ 30 ప్రభాతవార్త :**

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ముస్లిమ్‌లకు ఇచ్చిన 4 శాతం రిజర్వేషన్ తీసేస్తానని టిడిపి జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు చెబుతున్నారని, ముస్లిమ్‌లను మోసం చేస్తే చంద్రబాబుకు పుట్టగతులుండవని వైసిపి మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.ఎం.మాహీన్ అన్నారు. బిజెపి నాయకులు తాము అధికారంలోకి వస్తే ముస్లిమ్ రిజర్వేషన్లు తీసేస్తామని ప్రకటిస్తుంటే...దానిపై చంద్రబాబు ఏ మాత్రం స్పందించకుండా ఈ అంశం సుప్రీం కోర్టులో వుందని దాటవేత వైఖరి ప్రదర్శిస్తున్నారని మంగళవారం ముస్లిమ్‌లతో నిర్వహించిన ఒక సమావేశంలో తెలిపారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ముస్లిమ్‌ల రిజర్వేషన్‌పై తమ అభిప్రాయం చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర స్థాయిలో 11 మంది ముస్లిమ్‌లకు జగన్మోహనరెడ్డి పదవులు ఇచ్చారని, ముస్లిమ్‌లకు వ్యతిరేకంగా మాట్లాడే మోడి అడుగుజాడల్లో చంద్రబాబు నడుస్తున్నాడని తెలిపారు. ముస్లిమ్‌లంతా జగన్‌తోనే వున్నారని తెలిపారు.

## వైసిపి నుంచి టిడిపి తీర్థం పుచ్చుకున్న అర్జున్‌బాబు



ఏర్పేడు, ఏప్రిల్30, ప్రభాతవార్త;

మండలంలోని పాపానాయుడుపేట గ్రామానికి చెందిన మేకలతూరు అర్జున్‌బాబు గతంలో కాంగ్రెస్, వైసిపి పార్టీల అభిమానిగా ఉంటూ గ్రామంలో తనదైన శైలిలో సేవలు అందించడమే కాకుండా గ్రామంలోని శ్రీద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి వారి ఆలయ చైర్మెనగా పలు సేవలు అందించారు. ఆయన వైసిపి వీడి మంగళవారం తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు.ఈసందర్భంగా బొజ్జల సుధీర్‌రెడ్డి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

# వారి సేవలు అమూల్యం

## వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలి

## ఏపీఎస్‌పీడీసీఎల్ సీఎండీ కె.సంతోష్‌రావు

తిరుపతి, ఏప్రిల్ 30 ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ(ఏపీఎస్‌పీడీసీఎల్) వినియోగదారులకు మెరుగైన సేవలందిస్తూ చీఫ్ జనరల్ మేనేజర్లుగా పదవీ విరమణ చేస్తున్న వి.సురేష్‌కుమార్, కె.విజయకుమార్‌రెడ్డి, జనరల్ మేనేజర్ బి.చంద్రశేఖర్‌రావుల సేవలు అమూల్యమైన"వని ఆ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కె.సంతోష్‌రావు పేర్కొన్నారు. ఏపీఎస్‌పీడీసీఎల్‌లో వివిధ హోదాల్లో వినియోగదారులకు అందించిన సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. అనంతరం ఏపీఎస్‌పీడీసీఎల్ కార్పొరేట్‌కార్యాలయంలోని అనెక్స్ బిల్డింగ్‌సమావేశ మందిరంలో మంగళవారం జరిగిన పదవీ విరమణ సన్మాన కార్యక్రమంలో డైరెక్టర్లు ఎన్‌వీఎస్ సుబ్బరాజు, కె.శివప్రసాద్‌రెడ్డిలు మాట్లాడుతూ సురేష్‌కుమార్, విజయకుమార్‌రెడ్డి, చంద్రశేఖర్‌రావులు సిబ్బందితో మమేకమై విదులు నిర్వహిస్తూ సంస్థ అభివృద్ధికి తమవంతు చేయూతను అందించారని తెలిపారు.వారి శేష జీవితాన్ని సుఖ సంతోషాలతో గడపాలని ఆకాంక్షించారు. చీఫ్ జనరల్ మేనేజర్ల హోదాలో పదవీ విరమణ పొందిన వి.సురేష్‌కుమార్, కె.విజయకుమార్‌రెడ్డి, జనరల్ మేనేజర్ హోదాలో పదవీ విరమణ పొందిన బి.చంద్రశేఖర్‌రావులు మాట్లాడుతూ ఏపీఎస్‌పీడీసీఎల్‌లో వివిధ హోదాల్లో విధుల నిర్వహణలో తమకు సహకరించిన అధికారులు,సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారిని సంస్థ అధికారులు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు, శాలువలు, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమం లో చీఫ్ జనరల్ మేనేజర్లు జె.రమణాదేవి, డి.ఎస్.వరకుమార్, పి.అయూబ్‌ఖాన్, కె.గురవయ్య, వై.లక్ష్మి నరసయ్య, కె.ఆర్.ఎస్.దర్మజ్ఞాని, సీజీఎం(ఎఫ్ఏసీ) కె.ఆదివేషయ్య, ఓఎస్‌డీ శ్రీనివాసులు, జనరల్ మేనేజర్లు రామచంద్రరావు, శోభా వాలెంటీనా, మురళి, సురేంద్రరావు, గోపాలకృష్ణ, చంద్రశేఖర్ రెడ్డి, శ్రీకాంత్, శ్రీనివాసులు, తిరుపతి సర్కిల్ సూపరింటెండెంట్, ఇంజనీర్ ఎం.కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పుష్పగుచ్ఛాలు, శాలువలు జ్ఞాపికలతో ఘనంగా సన్మానిస్తున్న దృశ్యం

# అక్రమ మద్యం, ఓటర్లకు నగదు పంపిణీకి సంబంధించి ఫిర్యాదులు ఉంటే...

### జిల్లా స్క్వాడ్ బృందానికి తెలియజేయాలి - జిల్లా కలెక్టర్

నగరి, ఏప్రిల్ 30 ప్రభాతవార్త: అక్రమ మద్యం, ఓటర్లకు నగదు పంపిణీకి సంబంధించి ఫిర్యాదులు ఉంటే జిల్లా ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందానికి తెలియజేయాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి షన్మోహన్ తెలిపారు. సాధారణ ఎన్నికలు 2024 ఎన్నికల ప్రవర్తన నియమావళి సంబంధించి నియమా వళి ఉల్లంఘనలో భాగంగా చిత్తూరు జిల్లాలో ఎక్కడైనా అక్రమ మద్యం నిల్వలు, బహుమతులు, ఓటర్లకు నగదు పంపిణీ చేస్తున్నట్లు సమాచారం ఉన్న ఏడల జిల్ల ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం శిక్షణ డిప్యూటీ కలెక్టర్ కె.లక్ష్మిప్రసన్న ఆధ్వర్యంలో పనఇ చేయడం జరుగుతుందని వీరికి ఫిర్యాదులు చేయవచ్చునని సమాచారం అందించిన వారి వివరాలను రహస్యంగా ఉంచబడుతుందని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎస్.షన్మోహన్ మంగళవారం ఒక ప్రకటనలోతెలిపారు. డిప్యూటీ కలెక్టర్ లక్ష్మిప్రసన్న, ఫోన్ నెం.9603404789, సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్(ఎస్ఐ) శేషగిరి ఫోన్‌నెం. 9849962578, సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్(ఎస్ఐ) పి.కృష్ణకిషోర్ ఫోన్ నెం.8019396 602, డివిజనల్ పరిపాలన అధికారి వై.విజయభాస్కర్ ఫోన్ నెం.9491077011లకు సమాచారం అందించాలని జిల్లా కలెక్టర్ తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి

# అన్నార్తులకు భోజనం...పాదచారులకు అంబలి

### స్వయంభువు స్వామి ఆశ్రమంలో నిత్య సేవలు



సమాపంక్తి భోజనాలు అందిస్తున్న దృశ్యం

శ్రీకాళహస్తి,ఏప్రిల్ 30 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో సుమారు 35 సంవత్సరాలుగా సామాజిక నసేవలందిస్తూ అన్నార్తులకు అన్నం,పశువులకు దాణ అందిస్తున్న దాత స్వయంభువు సాంబ్రాణి స్వామి.గతంలో భరద్వాజతీర్థంలోని భరద్వాజేశ్వరుని సన్నిదిలో సేవలందిస్తూ అక్కడే పశుశాలను ఏర్పాటు చేసుకొని ఆ పాలను స్వామి సేవలకు అందించే వారు. అయితే 1999లో అప్పటి ధర్మకర్తల మండలి సందేహించి ఆయన్ను తప్పించారు. తరువాత ఆయన ఆలయానికి సమీపంలోని గోడ్డెరు వద్ద ప్రత్యేకంగా స్థలం కొనుగోలు చేసి సుబ్రమణ్యం స్వామి ఆలయాన్ని నిర్మించారు. గోశాలను ఏర్పాటు చేసారు.ఈ ఆలయంలో నిత్యపూజలతో విరాలజిల్లుతుంది. ఇక సుమారు 100కు పైగా గోవుల పోషణను చేస్తూ ఆ పాలను స్వామి అభిషేకంతో పాటు నిరుపేదల కాలనీల్లో పసిపిల్లలకు అందిస్తున్నారు. మంగళవారం సుబ్రమణ్యం స్వామి ఆలయంలో స్వామికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉదయం నుంచి పాదచారులకు అంబలిని అందించారు. పరిసరాల్లోని కాలనీల్లోని పిల్లలకు పోషకాహారంగా పళ్ళలను అందించారు. ఇక మధ్యాహ్నం పూజల తరువాత వందలాది మందికి భోజన వసతి కల్పించారు.ఆయన సేవలను దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్పందించారు.

# కాలుష్యం కోరల్లో గ్రామాలు

### -మెగా కంపెనీ డంప్‌యార్డు వద్ద గ్రామస్తుల ధర్నా

### -పోలీసుల రంగ ప్రవేశం

తొట్టంబేడు, ఏప్రిల్ 30 ప్రభాతవార్త : ఆరులైన్లరోడ్లు పనులను మెగా కంపెనీ చేపట్టిన విషయం విదితమే. ఈనేపథ్యంలో రోడ్డు నిర్మాణ పనులకు కావాల్సిన మెటీరియల్స్‌ను మండలంలోని లింగమనాయుడుపల్లి గ్రామసమీపంలో ఓపెద్ద డంపింగ్‌యార్డు ఏర్పాటుచేశారు. దీన్ని పరిశీలిస్తే అందరు అవాక్కవ్వాల్సిందే. ఓపెద్ద క్వారీ, పక్కనే రోడ్డు పనులకు ఉపయోగించే భారీ డంపింగ్‌యార్డు ఉన్నాయి. ఇక్కడ కంకర, క్రషర్‌మట్టి పెద్ద ఎత్తున ఉంటాయి. ఇక్కడ నుంచే రోడ్డు పనులకు ఉపయోగించే మొత్తం మెటీరియల్ సప్లయ్ చేస్తారు . అయితే ఇక్కడ ఉన్న క్వారీని పరిశీలిస్తే ఆశ్చర్యం వేస్తుంది. ఈక్వారీలో కంప్రెసర్‌తో చేయాల్సిన పనులను పవర్‌బోర్‌తో చేయడంతో లింగమనాయుడుపల్లి, గుమ్మడిగుంట,దొమ్మరపాళెం, క్రైస్తవమిట్ట, కురవకనేరి, మల్లిగుంట, రౌతుసూరమాల, భవానీశంకరాపురం గ్రామాల్లో క్వారీల్లో జరిగే బ్లాస్టింగ్ వల్ల పై గ్రామాల్లో ఇళ్ళు బీటలు వారుతున్నాయని గ్రామస్తులు పేర్కొన్నారు.పలుమార్లు విన్నవించినా కంపెనీ యాజమాన్యం పట్టించుకోకపోవడంతో మంగళవారం మెగా కంపెనీ డంపింగ్ కేంద్రం వద్ద గ్రామస్తులు ధర్నా చేశారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ ఇక్కడ నుంచి వచ్చే కాలుష్యంతో తాముఅనారోగ్యాల భారినపడ్డామన్నారు. కాలుష్యం వల్ల రైతులు వేసిన పంటలకు తెగుళ్ళు సోకడంతోపాటు వరికోతలు కోసే సమయంలో పంటపొలాల్లో నుంచి దుమ్ము అలాగే రావడం కనిపిస్తోంది. దీంతో రైతులకు మద్దతు ధర లేదు. కొందరు ప్రజలు కాలుష్యంతో మృతిచెందడంతో పాటు కిడ్నీలో రాళ్ళుతో బాధపడుతున్నామని గ్రామస్తులు పేర్కొన్నారు. ఓచిన్నారి అముద(8) ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతోందన్నారు.

**పోలీసుల రంగ ప్రవేశం..**

మెగా డంపింగ్‌యార్డు వద్ద ధర్నా జరుగుతోందని తెలుసుకున్న తొట్టంబేడు ఎస్ఐ రాఘవేంద్ర తమ సిబ్బందితో అక్కడకి చేరుకున్నారు. సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాలే కానీ ఇలా వాహనాలు ఆపడం సబబుకాదని ఎన్నికల కోడ్ ఉందని అనుమతి లేకుండా ధర్నాలు చేయడం నేరమని తెలిపారు. వాహనాలను ఆపడం సబబుకాదని తెలపడంతో ధర్నా చేస్తున్న వారిని అక్కడ నుంచి తరలించారు. కోడ్ నేపథ్యంలో ధర్నాలు చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.



మెగా కంపెనీ డంపింగ్‌యార్డు వద్ద ధర్నా చేస్తున్న గ్రామస్తులు

# భూమన ఆరోపణలు దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉంది

### ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు



సమావేశంలో మాట్లాడుతున్న ఆరణి శ్రీనివాసులు

తిరుపతి కార్పోరేషన్, ఏఫ్రిల్ 30 ప్రభాతవార్త : భూమన కరుణాకర్ రెడ్డి చేస్తున్న ఆరోపణలు దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ దౌర్జన్యం, దొంగ ఓట్లతో కరుణాకర్ రెడ్డి కొడుకును గెలిపించాలని చూస్తున్నాడన్నారు. 2019 ఎన్నికల్లో తిరుపతి ఎమ్మెల్యేగా గెలిచిందని టిడిపి అభ్యర్థి సుగుణమ్మ అని అధికారులను బెదిరించి తానే ఎమ్మెల్యేగా భూమన ప్రకటించుకున్నాడన్నాడని తెలిపారు. ప్రజాస్వామ్యబద్దంగా భూమన ఏ ఎన్నికల్లోను గెలవలేదన్నారు. టీటీడి చైర్మన్‌గా ఉన్న భూమన వెంకటేశ్వర స్వామికి, తిరుపతి ప్రజలకు క్షమాపణ చెప్పాలన్నారు. చిత్తూరు నుంచి ఒక్క రౌడీని కూడా నేను తీసుకురాలేదన్నారు. రాజంపేట నుంచి ఆలూరు శ్రీనివాసులను తీసుకొచ్చి స్వతంత్ర అభ్యర్థిగా నిలబెట్టారన్నారు. నేను నాన్ లోకల్ అనివైసిపి నేతలు దుష్ప్రచారం చేసినా తిరుపతి ప్రజలు నమ్మరన్నారు. భూమన కుటుంబం కడప నుంచి తిరుపతికి వచ్చిందన్నారు. అధికారులు కూడా నిష్పక్షపాతంగా ఎన్నికల్లో పనిచేయాలన్నారు.

# చౌడేపల్లిలో మొదలైన నడివీధి గంగమ్మ జాతర

### -ఘనంగా వివాహ మహోత్సవం



నడివీధి గంగమ్మను ఊరేగిస్తున్న యువకులు

చౌడేపల్లి, ఏప్రిల్ 30 ప్రభాతవార్త : యేటా ప్రతిష్టాత్మకంగా జరిగే నడివీధి గంగమ్మ జాతర మంగళవారం కోలాహలంగా ప్రారంభమైంది. రెండు రోజులపాటు జరుగు జాతరలో వివిధ కార్యక్రమాలు జరిగాయి. తొలిరోజున చౌడేశ్వరీ చెరువు వద్దగల మారెమ్మకు కడియాల వంశీయుడు మహేష్‌బాబు, లావణ్య దంపతులు తొలిపూజ చేసారు. దీంతో అమ్మవారి జాతర మొదలైంది. కుమ్మరివీధిలో వినాయక యువజన సంఘంచే నూతనంగా నిర్మించిన కళ్యాణ గంగమ్మ ఆలయంలో అమ్మవారిని పెళ్ళి కుమార్తెగా ముస్తాబు చేసారు. నిర్వాహకులచే విశేషపూజలనంతరం అక్కడి నుంచి సాంస్కృతిక కార్యక్రమాల మధ్య గంగమ్మను ఊరేగించారు. ఆసాదివాని మాటలు, పాటలు చూపరులను ఆకట్టుకొన్నాయి. స్థానిక చాకలివీధిలోకి అమ్మవారిని తీసుకొచ్చారు. ముందుగా ఏర్పాటు చేసిన వివాహ వేదిక వద్దకు అమ్మవారిని తీసుకొచ్చారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా గంగమ్మకు వివాహం చేయడం గమనార్హం. వివాహనంతరం అమ్మవారిని నడివీధిలో భక్తుల దర్శనార్థం ఉంచారు. బెస్తవారి ఇంటి నుంచి ఘట్టముకుండ వెళ్ళిన తర్వాత అమ్మవారి సర్వదర్శనం కోసం భక్తులు బారులు తీరారు. తెల్లవారు జామునే పట్టణ మహిళలు నాలుగు దిక్కుల్లోని గ్రామదేవతలకు పిండి దీపాలతో ఆరాధిస్తారు. గంగజాతరకు చుట్టు పక్కల ప్రాంతాల వారితోపాటు ఇతర రాష్ట్రాల నుంచి విశేష సంఖ్యలో భక్తులు తరలివచ్చి గంగమ్మకు మొక్కులు చెల్లించారు. జాతర సందర్భంగా పట్టణం మొత్తం పచ్చనితోరణాలతో నిండిపోయింది. అక్కడక్కడా అమ్మవారి ఉగ్రరూప విగ్రహాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఈ కార్యక్రమంలో గంగజాతర నిర్వాహక కమిటీ సభ్యులు, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

# ఓట్లను చీల్చడానికి బరిలో అభ్యర్థులను దింపిన వైసిపి

### జనసేన పార్టీ నేతలు

తిరుపతి హెల్త్, ఏఫ్రిల్ 30, ప్రభాతవార్త : జనసేన పార్టీ ఓట్లను చీల్చి వైకాపా గెలవాలనే కుట్రతో ఎన్నికలలో ఇండిపెండెంట్ అభ్యర్థులను భారీ సంఖ్యలో నామినేషన్లను వేయించి అలాగే గ్లాసు గుర్తు పోలీన పెన్ స్టాండ్, బకెట్ లాంటి గుర్తులను అలాగే తమ తిరుపతి ఉమ్మడి జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు లాంటి పోలిన వ్యక్తి అలూరు శ్రీనివాసులు చేత నామినేషన్ వేయించి వరుస సంఖ్య ఆరణిది 3 అయితే ఆలూరుది 4 గా బ్యాలెట్ పేపర్‌లో ఓటర్లను కన్ఫ్యూజ్ చేస్తూ జనసేన ఓట్లును చీల్చాలని కుట్రతో పథకం ప్రకారం వైకాపాచేత ప్రణాళిక సిద్ధమైనట్లు తమకు అనుమానంగా ఉందని, జనసేన పార్టీ తిరుపతి నేతలు కిరణ్ రాయల్, రాజారెడ్డి,సుభాషిని, సుమన్ బాబులు బాధాకరమైన ఆరోపణలు చేశారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం మీడియా ముందు వారు గాజు గ్లాసును చూపిస్తూ ఓటర్లు ఓటు వేసే ముందు గుర్తును, అభ్యర్థి పేరును క్షుణ్ణంగా పరిశీలించి ఓటు వేయాలని అభ్యర్థించారు. తిరుపతి శాసన సభ స్థానానికి దాదాపు 46 మంది బరిలో ఉన్నారని ఇందులో 25 మంది ఫ్యాన్ పార్టీ ఫ్యాన్స్ అని వచ్చిన చిక్కల్లా వీరివల్లేనని ఓటర్లకు తెలియజేసారు. వైసిపికి ఓడిపోతామన్న భయమా లేక గెలిచిపోతామన్న ధీమానా అంటూ చురకలు విసిరారు. ఎలక్షన్ కమిషన్ వారు గుర్తులున్నా మార్చండి లేదా సమస్యగా కన్ఫ్యూజన్‌గా ఉన్న అభ్యర్థులను వారి గుర్తులను చివరవరుసలో చేర్చాలంటూ కోరారు. ఈ విలేకరుల సమావేశంలో జనసేన నాయకులు రాజేష్ ఆచారి, సాయిదేవ్ యాదవ్, చందన, ఆది, రాజేంద్ర, భాను తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జనసేన నాయకులు

# భారత్, జర్మనీల మధ్య సహకారానికి గుర్తుగా బలమైన అవకాశాలున్నాయి

### ఐఐటీ డైరెక్టర్ ప్రొ. సత్యనారాయణ



జర్మనీ విద్యాసంస్థల ప్రతినిధులతో ఐఐటి తిరుపతి విద్యార్థుల బృందం

ఏర్పేడు, ఏప్రిల్30,ప్రభాతవార్త; మండల కేంద్రమైన ఏర్పేడు సమీపంలోని తిరుపతి ఐఐటిలో, ఐజర్ తిరుపతి అంతర్జాతీయ విద్యాసంస్థలకు సంబంధించి మంగళవారం ఐఐటీలో డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ సత్యనారాయణ అధ్యక్షతన పరిశ్రమ విద్యా సంస్థల ద్వారా ద్వైపాక్షిక విద్యా పై సమావేశం నిర్వహించారు. ఈకార్యక్రమానికి ఐఐటి,ఐజర్ తిరుపతి రెక్టార్ ప్రొ.డా.ఇంగ్‌జెన్స్ స్ట్రాకెల్‌జెన్, హైడెల్‌బర్గ్ యూనివర్సిటీ, యూనివర్సిటీ ఆఫ్ కొలోన్, ఫ్రీ యూనివర్సిటీట్ బెర్లిన్ వంటి ప్రతిష్ఠాత్మక జర్మన్ విశ్వవిద్యాలయాల ప్రతినిధులు పాల్గొన్నారు. పరిశ్రమల విద్యా సంస్థల ద్వారా ద్వైపాక్షిక విద్య మరియు ఆర్ అండ్ డి సహకారాన్ని పెంపొంధించడానికి ఇండో జర్మన్ సైన్స్ టెక్నాలజీ కోఆపరేషన్ చొరవలో భాగంగా బెర్లిన్ లోని భారత రాయబార కార్యాలయం ఈపర్యటనను సమన్వయం చేసినట్లు తెలిపారు. ఈసమావేశాలకు అధ్యక్షత వహించిన రాయబారి హరీష్ పర్వతనేని, సైంటిఫిక్ అడ్వైజర్ డా. రామానుజ్ బెనర్జి ప్రతినిధుల బృందానికి ఐఐటీ తిరుపతి డైరెక్టర్ ప్రొ.డా. సత్యనారాయణ వారికి స్వాగతం పలికారు. ఈసందర్భంగా జర్మనీ ప్రతినిధి బృందం.

ఐఐటికి చెందిన విద్యావేత్తల మధ్య వివిద సహకార కార్యక్రమాలపై ఉన్నత స్థాయి చర్చలు జరిగాయి. తిరుపతి ఐఐటి డైరెక్టర్ డా. ప్రొ. కెఎన్ సత్యనారాయణ మాట్లాడుతూ భారత్ జర్మనీల మధ్య బలమైన సహకారానికి భారీ అవకాశాలున్నాయన్నారు. ఇరు దేశాల మధ్య సహకార చరిత్రను గుర్తు చేస్తూ ఐఐటి మద్రాస్‌ను స్థాపించడంలో జర్మనీ నుంచి లభించిన సహకారాన్ని ఆయన ప్రస్థావించారు.

మాగ్దేబర్గ్‌లో ఇంటెల్ యొక్క సిలికాన్ జంక్షన్ స్థాపన కారణంగా రెండు దేశాల విద్యార్థులు మరియు పరిశోధకులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని మరియు రెండు దేశాల అవసరాలను పరిష్కరించే క్లిష్టమైన మరియు అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలతో పని చేయాలని ఆయన అభిప్రాయపడ్డారు. ఈసందర్భన ఐఐటి తిరుపతి మరియు ఐజర్ తిరుపతితో జర్మన్ ఇన్‌స్టిట్యూట్‌ల మధ్య భావి భాగస్వామ్యానికి నాంది పలికిందన్నారు. ఈకార్యక్రమంలో పలు విదేశాలకు చెందిన యూనివర్సిటీల ప్రతినిధులు, ఐఐటి, ఐజర్ విద్యాసంస్థల ప్రొఫెసర్లు,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# పక్షులకు మూకట్లలో నీళ్ళు...నక్షత్రవనం పరిరక్షణ : ఇఓ





పక్షులకు మట్టిమూకట్లలో నీరు ఏర్పాటు చేస్తున్న దృశ్యం - గంగా సదన్ పరిసరాలను పరిశీలిస్తున్న దృశ్యం

శ్రీకాళహస్తి,ఏప్రిల్ 30 ప్రభాతవార్త : నోరు లేని జీవాలకు ఆహారం,పక్షులకు మూకట్లలో నీళ్ళు, నక్షత్రవనంలో చెట్ల పరిరక్షణకు చర్యలు తతీసుకోవాలని శ్రీకాళహస్తీశ్వరాలయ కార్యనిర్వహణాధికారి ఎస్‌వి నాగేశ్వరరావు తన సిబ్బందికి, ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశించారు. మంగళవారం ఆయన ఇంజనీరింగ్ సిబ్బందితో కలసి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ముఖ్యంగా ఎండలు మండుతున్న తరుణంలో ఆలయానికి అనుబంధమైన భరద్వాజ తీర్థంలోని పలు ప్రజాహిత ప్రాంతాలను ఆయన పరిశీలించారు. భరద్వాజ తీర్థంలో నీరు అడుగింటింది. ఇక్కడ జలచరాల పరిస్థితినిసమీక్షించారు. అలాగే ఇక్కడ వృక్షసంపదను ఎలా కాపాడుకోవాలనే అంశాన్ని పరిశీలించి ఇంజనీరింగ్ అదికారి ఇఇ నూకారత్నం, డిఇఇ శ్రీనివాసులురెడ్డితో చర్చించారు. కాగా ఇక్కడే నక్షత్ర వనం ఉంది. ఇక్కడ సమాజానికి ఉపయోగపడే వృక్షాలను ఏర్పాటు చేసారు. ఇక్కడ వృక్ష సంపదే కాకుండా వివిధ రకాల పక్షులు బస చేసి ఉన్నట్లు గుర్తించారు. ఆ పక్షులు ఎండతాపానికి దాహార్తిలై తిరుగుతున్నట్లు గుర్తించారు. వీటికి నీటిని, ఆహారాన్ని అందించుటకు మట్టి మూకట్లలో చెట్లకు కట్టి నీళ్ళు ఏర్పాటు చేసారు.

**గంగా సదన్ పరిశీలన:**

అలాగే ఇక్కడ సుమారు రూ.13కోట్లలో గంగా సదన్, అలాగే రూ.5కోట్లతో టిటిడిచే నిర్మించిన డార్మెంటరీలను పరిశీలించారు. గంగా సదన్‌లో బస చేసిన భక్తులను సదుపాయాల గురించి వాకబు చేసారు. ఇక్కడ సెల్ ఫోన్లు, గదుల్లో ఎసీలు పని చేయటం లేదని ఈ సదుపాయాలు మెరుగుపరచాలని భక్తులు కోరారు. ఇక ఇక్కడకు చేరుకోవటానికి ఇబ్బందిగా ఉందని ఇఓకు వివరించారు.ఇక పార్కులను ఇంకా అభివృద్ధి చేయాల్సి ఉందని తెలిపారు. గదులు బాగున్నాయని, సదుపాయాలు లేవని భక్తులు వివరించారు.

దేవస్థానంచే ఇక్కడ బస చేసే భక్తులకు భోజన వసతి కల్పిస్తే బాగుంటుందని భక్తులు ఇఓ నాగేశ్వరారావు దృష్టికి తెచ్చారు. పరిశీలిస్తామని భక్తులకు ఇఓ భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమాల్లో ఇఓ నాగేశ్వరరావుతో పాటు ఎసి మల్లికార్జున్ ప్రసాద్,ఇఇ నూకారత్నం, డిఇఇ శ్రీనివాసులురెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

**CHANGE OF NAME**

I, **MOORI LAKSHMIKARA REDDY** (Old Name), R/at DNO:1/290, Sivalayam Street, Utukuru V&P, Rajampeta (M), Annamayya Dist, AP. I have changed my name to **MURI LAKSHMIKAR REDDY** S/O MURI VENKATASUBBA REDDY.